


# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

**బాక్సింగ్‌లో మెరిసిన భారత మహిళలు**

*రెండు స్వర్ణాలు సహా నాలుగు పతకాలు*

14

# భళా.. దేవాన్ష్

- ఫాస్టెస్ట్ చెక్‌మేట్ సాల్వర్‌గా వరల్డ్ రికార్డు
- వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో దేవాన్ష్‌కు చోటు
- లండన్‌లోని వెస్ట్ మినిస్టర్ హాల్లో అవార్డు స్వీకరణ
- ప్రదానోత్సవ కార్యక్రమానికి హాజరైన తండ్రి లోకేష్
- ప్రత్యేకమైన ఘనత సాధించడం గర్వకారణమంటూ వ్యాఖ్య
- ఛాంపియన్‌కు అభినందనలంటూ చంద్రబాబు ట్వీట్



అమరావతి (చైతన్య రథం): విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ తనయుడు, పదేళ్ల యువ చెస్ ప్రాడిజీ నారా దేవాన్ష్ చదరంగంలో అత్యంత క్లిష్టమైన 175 పజిల్స్‌ను వేగంగా పరిష్కరించడం ద్వారా ఫాస్టెస్ట్ చెక్ మేట్ సాల్వర్‌గా ప్రపంచ రికార్డ్ సాధించి 'వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో చోటు దక్కించుకున్నాడు. లండన్‌లోని వెస్ట్ మినిస్టర్ హాల్లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో "ఫాస్టెస్ట్ చెక్ మేట్ సాల్వర్-175 పజిల్స్" అవార్డును స్వీకరించాడు. కార్యక్రమానికి విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ హాజరై.. కొడుకు సాధించిన ఘతన చూసి మురిసిపోయారు.


ఈ ఘనతను సాధించేందుకు నారా దేవాన్ష్ గత ఏడాది చెక్ మేట్ మారథాన్‌లో లాస్లో పోల్గార్ ప్రసిద్ధ చెస్ సంకలనం '5334 ప్రాబ్లమ్స్ అండ్ గేమ్స్' పుస్తకంనుంచి తీసుకున్న 175 సంక్లిష్టమైన చెక్ మేట్ పజిల్స్‌ను వేగవంతంగా పరిష్కరించాడు. ఈ పజిల్స్ ఒకటి తర్వాత ఒకటి కష్టంగా మారుతూ వేగం, కచ్చితత్వం, ఆలోచనా నైపుణ్యాలను పరీక్షిస్తుంది. దేవాన్ష్ వీటన్నిటినీ అత్యంత తక్కువ సమయంలో పరిష్కరించడం ద్వారా రికార్డు సృష్టించారు. ప్రపంచ చెస్ రంగంలో అత్యుత్తమ యువ ప్రతిభావంతుల్లో ఒకరుగా దేవాన్ష్‌కు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం లభించింది. ఈ విజయానికి దేవాన్ష్ అకుంఠిత శ్రమతోపాటు, తల్లి నారా బ్రాహ్మణి, తండ్రి నారా లోకేష్, కోచ్ కె రాజశేఖర్‌రెడ్డి ప్రోత్సాహం అందించారు.

### గర్వకారణం: మంత్రి లోకేష్



ఈ విజయం గురించి మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ "ఈరోజు వెస్ట్‌మినిస్టర్ హాల్లో దేవాన్ష్ ఈ గౌరవాన్ని అందుకోవడం ప్రత్యేకమైంది. అతని ముందుచూపు, ఆలోచనాశక్తి, ఒత్తిడిలో ప్రదర్శించిన సమయస్ఫూర్తి, చిన్న వయస్సులోనే పూర్తిగా ఆటకు అంకితం కావడం వంటి విభిన్న శైలివల్ల ఈ విజయం సాధ్యమైంది. తండ్రిగా దేవాన్ష్ అవిశ్రాంత శ్రమని నేను దగ్గరగా చూశాను. ఈ గుర్తింపు అతని కృషికి నిజమైన బహుమతి. మేమంతా అతను సాధించిన ఈ ఘనతకు ఎంతో గర్వపడుతున్నాం" అని వ్యాఖ్యానించారు. దీంతోపాటు దేవాన్ష్ మరో రెండు ప్రపంచ రికార్డులను కూడా గతంలో సొంతం చేసుకున్నాడు. 7-డిస్క్ టవర్ ఆఫ్ హనోయ్‌ను కేవలం నిమిషం 43 సెకన్లలో పూర్తి చేయడం, 9 చెస్ బోర్డ్స్‌పై 32 పావులను సరైన పద్ధతి ద్వారా 5 నిమిషాల్లో అమర్చడంలో ప్రపంచ రికార్డులు సాధించాడు. ఇప్పుడు లండన్‌లో జరిగిన అవార్డ్స్ కార్యక్రమంలో ఆయనకు లభించిన గుర్తింపు ఆయన కుటుంబానికి, అలాగే ప్రపంచ చెస్‌రంగంలో భారత్ తరపున పెరుగుతున్న ఖ్యాతికి గర్వకారణంగా నిలిచింది.

### అభినందనలు: సీఎం చంద్రబాబు



చదరంగంలో అత్యంత క్లిష్టమైన 175 పజిల్స్‌ను వేగంగా పరిష్కరించడం ద్వారా ఫాస్టెస్ట్ చెక్‌మేట్ సాల్వర్‌గా ప్రపంచ రికార్డ్ సాధించాడు ముఖ్యమంత్రి చంద్రబాబు మనుమడు, మంత్రి నారా లోకేష్ కుమారుడు దేవాన్ష్. లండన్‌లోని వెస్ట్ మినిస్టర్ హాల్‌లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి హాజరై "ఫాస్టెస్ట్ చెక్ మేట్ సాల్వర్-175 పజిల్స్" అవార్డ్ అందుకున్న సందర్భంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశీర్వాద అభినందనలు తెలిపారు. ఈమేరకు ఎక్స్ వేదికపై పోస్టు పెడుతూ.. 'లండన్‌లోని వెస్ట్ మినిస్టర్ హాల్‌లో 2025 వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు అందుకున్నందుకు దేవాన్ష్‌కు అభినందనలు. పట్టుదలతో నెలల తరబడి సాధన, గురువుల మార్గదర్శకత్వం తర్వాత 175 పజిల్స్‌లో ఫాస్టెస్ట్ చెక్‌మేట్ సాల్వర్‌గా అతను సాధించిన రికార్డుపట్ల గర్విస్తున్నాం. శుభాకాంక్షలు, ఛాంపియన్' అని పోస్టులో పేర్కొన్నారు.

## తిరుపతిలో అత్యాధునిక బస్‌స్టేషన్



- రోజుకు లక్షమంది రాకపోకలు సాగించేలా అభివృద్ధి
- కమర్షియల్ కాంప్లెక్స్, ఈవీ చార్జింగ్ స్టేషన్లతో డిజైన్లు
- నమూనాలను పరిశీలించిన సీఎం చంద్రబాబు నాయుడు

2

## నేటినుంచి కలెక్టర్ల కాన్ఫరెన్స్

- రెండు రోజులపాటు జరగనున్న సదస్సు
- 4వ సదస్సులో శాఖలపై అంశాలవారీ సమీక్ష
- వృద్ధిరేటు, పౌర సేవలు, ప్రభుత్వ పథకాలపై దిశానిర్దేశం చేయనున్న సీఎం చంద్రబాబు

2

## ఆక్వాను ఆదుకోండి

- పరిస్థితిని వివరిస్తూ కేంద్రాన్ని కోరిన సీఎం చంద్రబాబు
- ఆర్థిక, వాణిజ్య, మత్స్యశాఖల మంత్రులకు వేర్వేరుగా లేఖలు..
- అమెరికా సుంకాలు.. ఏపీ ఆక్వాకు విఘాతంగా వివరించిన సీఎం
- దేశీయ వినియోగం పెంచి.. ప్రత్యామ్నాయ మార్గాలు చూడాలని విజ్ఞప్తి
- ఉత్తర భారతానికి ఆక్వా రవాణాకు డెడికేటెడ్ రైళ్లు నడపాలని ప్రతిపాదన

2

**ప్రతికూల వాతావరణంలో**

## సీఎం తిరుపతి పర్యటన రద్దు

అమరావతి (చైతన్య రథం): ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుపతి పర్యటన రద్దయింది. వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో.. ఆదివారం తిరుపతిలో ప్రారంభమైన జాతీయ మహిళా సాధికారత సదస్సుకు హాజరు కాలేకపోయినట్టు అధికారులు తెలిపారు. తిరుపతిలో జాతీయ మహిళా సాధికారత సదస్సుకు సీఎం హాజరుకావాల్సి ఉంది. అయితే అమరావతి- తిరుపతి మధ్య దట్టమైన మేఘాలు అలముకొని ఉండటంతో ఏవియేషన్ అధికారులు క్లియరెన్స్ ఇవ్వలేదు. దీంతో ముఖ్యమంత్రి పర్యటన చివరి క్షణంలో రద్దయినట్టు అధికారులు వెల్లడించారు.

## మహిళా సాధికారతతోనే దేశ సమగ్రాభివృద్ధి



- వారిని గౌరవించడం మన సాంప్రదాయం
- మహిళా విద్య, స్వావలంబనే పురోగతికి కీలకం
- లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఉద్ఘాటన
- తిరుపతిలో మహిళా సాధికారత కమిటీల జాతీయ సదస్సును ప్రారంభించిన ఓం బిర్లా

3


## మరింత బలంగా మహిళా వాణి



- పార్టీలకతీతంగా వారి సాధికారతకు కృషి
- అసెంబ్లీకి రాని ఎమ్మెల్యేల విషయంలో లోక్‌సభ స్పీకర్ మార్గనిర్దేశం అవసరం
- జాతీయ మహిళా సాధికారత సదస్సులో స్పీకర్ అయ్యన్నపాత్రుడు

4

## దుబాయ్‌లో పాక్ చిత్తు



- ఆసియా కప్ గ్రూప్ మ్యాచ్‌లో భారత్ సునాయాస విజయం
- రాణించిన కుల్‌దీప్, సూర్యకుమార్

14


## మహిళా సాధికారతకు ఎన్టీఆర్ ఎనలేని కృషి

- సీఎం చంద్రబాబు విజన్‌తో టెక్నాలజీ హబ్‌గా ఏపీ
- రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్

3

# ఆక్వాను ఆదుకోండి

- పరిస్థితిని వివరిస్తూ కేంద్రాన్ని కోరిన సీఎం చంద్రబాబు
- ఆర్థిక, వాణిజ్య, మత్స్యశాఖల మంత్రులకు వేర్వేరుగా లేఖలు..
- అమెరికా సుంకాలు.. ఏపీ ఆక్వాకు విఘాతంగా వివరించిన సీఎం
- దేశీయ వినియోగం పెంచి.. ప్రత్యామ్నాయ మార్గాలు చూడాలని విజ్ఞప్తి
- ఉత్తర భారతానికి ఆక్వా రవాణాకు డెడికేటెడ్ రైళ్లు నడపాలని ప్రతిపాదన



అమరావతి (చైతన్య రథం): అమెరికా సుంకాలతో ఇబ్బందిపడుతున్న ఆక్వా రైతాంగాన్ని ఆదుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్రాన్ని కోరారు. ఆక్వా రైతులు నష్టపోకుండా కేంద్రస్థాయిలో కొన్ని నిర్ణయాలు తీసుకోవాలని కోరుతూ చంద్రబాబు వివిధ కేంద్ర మంత్రులకు లేఖలు రాశారు. దేశీయంగానూ ఆక్వా ఉత్పత్తుల వినియోగం పెరిగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈమేరకు కేంద్ర ఆర్థిక మంత్రి సీతారామన్, వాణిజ్య-పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్, మత్స్య శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్‌కు సీఎం విడివిడిగా లేఖలు రాశారు. జీఎస్టీ, ఆర్థిక వెసులుబాటు వంటి అంశాలను పరిశీలించాలని కేంద్ర ఆర్థిక మంత్రిని, ఇతర దేశాలతో ఆక్వా విషయంలో ఒప్పందాలు కుదుర్చుకునేలా చూడాలని కేంద్ర వాణిజ్య-పరిశ్రమల శాఖ మంత్రిని, దేశీయ మార్కెట్ పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కేంద్ర మత్స్య శాఖ మంత్రిని ఆ లేఖల్లో కోరారు. రాష్ట్రంలో ఆక్వా రైతులు, ఆ రంగంపై ఆధారపడిన కుటుంబాలు తీవ్ర ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నాయని సీఎం తన లేఖల్లో ప్రస్తావించారు. అలాగే ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను చంద్రబాబు కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. జాతీయస్థాయిలో జరిగే రొయ్యల ఎగుమతుల్లో ఏపీనుంచి 80 శాతం వాటా ఉందని.. సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల్లో 34 శాతం వాటా ఏపీ కలిగి ఉందని సీఎం పేర్కొన్నారు. సుమారు రూ.21,246 కోట్ల విలువైన సముద్ర, మత్స్య ఉత్పత్తులు ఏపీనుంచి ఎగుమతి అవుతున్నాయని సీఎం పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఆక్వారంగం మీద ఆధారపడి 2.5 లక్షల ఆక్వా రైతు కుటుంబాలు, 30 లక్షలమంది ఆక్వా అనుబంధ రంగాలపై ఆధారపడిన వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కేంద్ర మంత్రులకు రాసిన లేఖల్లో సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. అమెరికా విధించిన సుంకాలతో రొయ్యలు ఎగుమతులపై ఎక్కువగా ప్రభావం పడిందని ఆయన స్పష్టం చేశారు. దాదాపు రూ.25 వేల కోట్లమేర నష్టం జరిగి ఉంటుందని అంచనా వేస్తున్నట్టు సీఎం తన లేఖల్లో పేర్కొన్నారు. 50శాతం మేర ఎగుమతుల ఆర్డర్లు రద్దయ్యాయని లేఖలో వివరించారు. దాదాపు 2 వేల కంటైనర్లలో జరుగుతున్న ఎగుమతులపై రూ.600 కోట్లమేర సుంకాల భారం పడిందని తెలిపారు. ఆక్వా రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని.. ఆక్వా ఫీడ్ ఉత్పత్తిదారులతో జరిపిన చర్చల ఫలితంగా కేజీ ఆక్వా ఫీడ్ ఎమ్మార్పీపై రూ.9మేర తగ్గించ గలిగామన్నారు. సబ్సిడీతో ట్రాన్సఫార్మర్లు సరఫరా చేసేందుకూ ఆలోచన చేస్తున్నామని సీఎం తన లేఖల్లో వివరించారు.

### ఆక్వా రుణ వడ్డీలపై మారటోరియం విధించండి

రాష్ట్రం ప్రభుత్వంతోపాటు కేంద్ర సాయం కూడా ఆక్వా రైతులను నిలబెట్టేందుకు అవసరమవుతుందని కేంద్ర మంత్రులకు రాసిన లేఖలో ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ఎగుమతిదారులకు.. ఆక్వా కంపెనీలకు బ్యాంకులనుంచి ఆర్థిక సహాయం, వడ్డీ చెల్లింపులపై 240 రోజులపాటు మారటోరియం విధించాలని కోరారు. వడ్డీ రాయితీ కల్పించడంతోపాటు... ఫ్రొజెన్ రొయ్యలపై ఉన్న 5శాతం జీఎస్టీని తాత్కాలికంగా మినహాయించడంవంటి చర్యలు తీసుకోవాలని సీఎం లేఖల్లో కోరారు. ఈ చర్యలతోపాటు అమెరికా కాకుండా ఇతర దేశాలకు ఆక్వా మార్కెట్‌ను విస్తరించే అంశంపై దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. యూరోపియన్ యూనియన్, సౌత్ కొరియా, సౌదీ, రష్యా దేశాల్లో ఆక్వా ఎగుమతులు పెరిగేలా ఆయా దేశాలతో ఫ్రీ ట్రేడ్ ఒప్పందాలు కుదుర్చుకునే అంశాలను పరిశీలించాలని లేఖల్లో ముఖ్యమంత్రి కోరారు. ఎగుమతిదారులకు మధ్యంతర ఆర్థిక సహాయం, ఎగుమతులపై విధించే సుంకాలు, పన్నుల ఉపశమనం పథకంపై మరింత స్పష్టత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. యూరోపియన్ యూనియన్ దేశాలకు సీ-ఫుడ్ సరఫరా చేయడానికి తాము సిద్ధంగా ఉన్నట్టు ఎగుమతిదారులు తనకు విజ్ఞప్తి చేశారని సీఎం చంద్రబాబు వివరించారు.

### ఆక్వా ఉత్పత్తుల రవాణాకు డెడికేటెడ్ రైళ్లు వేయండి

ఈ చర్యలతోపాటు దేశీయంగా ఆక్వా మార్కెట్ పెంచుకోవడానికి అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దీనికోసం రూ.100 కోట్లతో కార్పస్ ఫండ్ కేటాయించాలని కోరారు. కోల్డ్ స్టోరేజీలు, హైజీనిక్ ఫిష్, సీ-ఫుడ్ మార్కెట్ల ఏర్పాటు చేయాలని కోరారు. రైతులనుంచి ఆక్వా ఉత్పత్తులను నేరుగా మార్కెట్లకు తరలించేలా ఆంధ్రప్రదేశ్ రొయ్యల ఉత్పత్తిదారుల సమన్వయ కమిటీని ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. అలాగే దేశంలోనూ సీ-ఫుడ్ వినియోగం పెంచేలా చర్యలు చేపట్టాలని సీఎం కోరారు. ఆక్వా ఉత్పత్తుల్లో మంచి ప్రొటీన్ ఉంటుందని.. ఇది బలవర్ధకరమైన ఆహారమనే విషయాన్ని అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికోసం ఎన్ఎఫ్డీబీ వివిధ రాష్ట్ర ప్రభుత్వాలతో అవగాహన కుదుర్చుకోవాలని సూచించారు.

జాతీయ సగటు ప్రకారం ఏడాదికి తలసరి వినియోగం 20-30 కిలోల చేపలను ఆహారంగా తీసుకోవాలని ప్రస్తుతం 12-13 కిలోలను మాత్రమే వినియోగిస్తున్నారని చెప్పారు. ఈ పరిస్థితుల్లో సీ-ఫుడ్‌ను ప్రోత్సహిస్తే ప్రజలకు ఆరోగ్య సమస్యలను తగ్గించడంతోపాటు... ఆక్వా రైతులకు అండగా నిలిచినట్టవుతుందని తెలిపారు. దక్షిణ భారతదేశం నుంచి దేశంలోని వివిధ ప్రాంతాలకు ఆక్వా రవాణా కోసం డెడికెటేడ్ రైళ్లు వేయాలని విజ్ఞప్తి చేశారు.

కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా మత్స్యకారులకు రూ.లక్ష వరకు వన్-టైమ్ టాప్-అప్ రుణాలు ఇవ్వాలని కోరారు. కొత్త మార్కెట్లలో పోటీతత్వాన్ని పెంచడానికి ఎఫ్ఐడీఎఫ్ ద్వారా ప్రాసెసింగ్, ప్యాకేజింగ్, కోల్డ్ చైన్ సౌకర్యాలను అభివృద్ధి చేయాలని సీఎం కోరారు. ఐకార్-సీఐబీఏ, ఐకార్-ఎన్‌బీఎఫ్‌జీఆర్ వంటి సంస్థల ప్రాంతీయ కార్యాలయాలను ఏపీలో ఏర్పాటు చేయాలని సీఎం తన లేఖల్లో కేంద్ర మంత్రులను కోరారు.

## నేటినుంచి కలెక్టర్ల కాన్ఫరెన్స్

- రెండు రోజులపాటు జరగనున్న సదస్సు
- 4వ సదస్సులో శాఖలపై అంశాలవారీ సమీక్ష
- వృద్ధిరేటు, పౌర సేవలు, ప్రభుత్వ పథకాలపై దిశానిర్దేశం చేయనున్న ముఖ్యమంత్రి

అమరావతి (చైతన్య రథం): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన నేడు, రేపు.. రెండు రోజులపాటు 4వ కలెక్టర్ల కాన్ఫరెన్సు జరగనుంది. సచివాలయం ఐదో బ్లాక్‌లో ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్సు ప్రారంభంకానుంది. పౌరసేవలు, పథకాల అమలుపై జిల్లాలవారీగా జవాబుదారీతనం ఉండేలా కాన్ఫరెన్సు నిర్వహించాలని సీఎం ఇప్పటికే ఆదేశించారు. ఆమేరకు ఉన్నతాధికార్లు కలెక్టర్ల కాన్ఫరెన్సులో సమీక్షకు అంశాలవారీ శాఖలను విభజించి ప్రజెంటేషన్లు రూపొందించారు. రెండు రోజులపాటు జరిగే సదస్సులో 15న జీఎస్డీపీపై ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. ఇందులో భాగంగా ప్రాథమిక రంగంనుంచి వ్యవసాయం అనుబంధ రంగాలు, పరిశ్రమలు, సేవలరంగంలో భాగంగా పర్యాటకం, హౌసింగ్ తదితర శాఖల పురోగతి ఆయా జిల్లాల్లో ఎలా ఉందన్న అంశాన్ని కలెక్టర్లనుంచి తెలుసుకోనున్నారు. రెండో అంశంగా సంక్షేమం, సూపర్ సిక్స్ పథకాలు, అన్న క్యాంటీన్లు, పీ-4 తదితర అంశాల అమలు ఎలా ఉందన్న దానిపై సమీక్ష జరగనుంది. మూడో అంశంగా లాజిస్టిక్స్, మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో భాగంగా రహదారులు, పోర్టులు, ఎయిర్ పోర్టులు, హైవేలు, సాగునీటి ప్రాజెక్టులు, ఇంధనం తదితర అంశాల పురోగతిపై వివరాలు తెలుసుకోనున్నారు. నాలుగోఅంశంగా స్వచ్ఛాంధ్ర, సర్క్యులర్ ఎకానమీ, పంచాయితీరాజ్, మున్సిపల్ తదితర అంశాలపై ప్రజెంటేషన్‌తోపాటు జిల్లాల్లో ప్రస్తుత పరిస్థితి ఏమిటన్న దానిపై కలెక్టర్లనుంచి సీఎం వివరాలు అడిగి తెలుసుకోనున్నారు. ఇక రెండోరోజు 16న ఐదో అంశంగా మానవ వనరుల అభివృద్ధి, వైద్యారోగ్యం, విద్య, స్కిల్ డెవలప్మెంట్‌పై ప్రజెంటేషన్‌తో పాటు కలెక్టర్లకు సీఎం దిశానిర్దేశం చేయనున్నారు. ఆరో అంశంగా ఐటీ, క్వాంటం వ్యాలీ, ఆర్టీఐహెచ్, వాట్సాప్‌లో పౌరసేవలు, డేటా లేక్, ఏఐ తదితర అంశాలను చర్చించనున్నారు. ఏడో కేటగిరీలో ఆదాయార్జన శాఖలైన రెవెన్యూ, భూములు, స్టాంపులు రిజిస్ట్రేషన్, ఎక్సైజ్, వాణిజ్య పన్నులు, మైనింగ్, అటవీ, ట్రాన్స్‌పోర్టు, మున్సిపల్, పంచాయితీరాజ్ శాఖలపై జిల్లాలవారీగా వివరాలు తెలుసుకోనున్నారు. ఇక 8వ అంశంగా రాష్ట్రంలో శాంతిభద్రతలపై ఎస్పీలు, జిల్లా కలెక్టర్లతో సమీక్షించి సీఎం దిశానిర్దేశం చేయనున్నారు. అనంతరం ప్రభుత్వ విభాగాలు అందించే పౌర సేవలపై ప్రజల్లో సంతృప్తస్థాయిపైనా చర్చించనున్నారు.

## తిరుపతిలో అత్యాధునిక బస్‌స్టేషన్

- రోజుకు లక్షమంది రాకపోకలు సాగించేలా అభివృద్ధి
- కమర్షియల్ కాంప్లెక్స్, ఈవీ చార్జింగ్ స్టేషన్లతో డిజైన్లు
- నమూనాలను పరిశీలించిన సీఎం చంద్రబాబు నాయుడు

అమరావతి (చైతన్య రథం): రోజురోజుకు పెరుగుతున్న యాత్రికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని తిరుపతిలో అత్యాధునిక బస్‌స్టేషన్ నిర్మించాలని, అన్ని సౌకర్యాలతో ఆకట్టుకునేలా ఉండాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో నేషనల్ హైవేస్ లాజిస్టిక్స్ మేనేజ్మెంట్ లిమిటెడ్, ఏపీఎస్ఆర్టీసీ అధికారులతో సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి... నూతనంగా నిర్మించే బస్‌స్టేషన్‌లో సుమారు 150 బస్సులు ఒకేసారి నిలిపిఉంచేలా బస్ బే ఉండాలని, హెలిపాడ్ సౌకర్యంతోపాటు, రోప్ వే, కమర్షియల్ కాంప్లెక్స్‌లు, మాల్స్, మల్టీప్లెక్స్‌లతో డిజైన్లు రూపొందించాలని అధికారులకు సూచించారు.

రెండు బస్ ఎంట్రీలు, ఎగ్జిట్ వేలు 2 ఏర్పాటు చేయాలని, సోలార్ రూఫ్ టాప్‌తో సొంత విద్యుత్ అవసరాలు తీర్చుకునేలా చూడాలన్నారు. మొత్తం 13 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించ తలపెట్టిన బస్‌స్టేషన్ కనీసం లక్షమంది నిత్యం రాకపోకలు సాగించేందుకు వీలుగా నిర్మాణం ఉండాలన్నారు. భవిష్యత్‌లో అన్నీ ఎలక్ట్రికల్ బస్సులే నడపనున్న నేపథ్యంలో ప్రతీ బస్సుకు చార్జింగ్ సౌకర్యం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చెప్పారు. దీనికి సంబంధించి మొత్తం 5 మోడల్స్‌ను ముఖ్యమంత్రి పరిశీలించారు. వాటిని మరింత అభివృద్ధి చేయాలన్నారు.

దీనికోసం స్టేక్ హోల్డర్లతో సమావేశం నిర్వహించాలన్నారు. అలాగే రాష్ట్రంలో అన్ని బస్‌స్టేషన్ల ఆధునీకరణకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం చంద్రబాబు అధికారులకు సూచించారు.

# మహిళా సాధికారతతోనే దేశ సమగ్రాభివృద్ధి

- వారిని గౌరవించడం మన సాంప్రదాయం
- మహిళా విద్య, స్వావలంబనే పురోగతికి కీలకం
- లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఉద్ఘాటన
- తిరుపతిలో మహిళా సాధికారత కమిటీల జాతీయ సదస్సును ప్రారంభించిన ఓం బిర్లా





తిరుపతి (చైతన్యరథం): మహిళల ఆధ్వర్యంలోని అభివృద్ధి, బాలల సంక్షేమమే 2047 నాటికి వికసిత్ భారత్ దృష్టికోణానికి పునాది అని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అన్నారు. పార్లమెంట్, రాష్ట్ర/కేంద్రపాలిత ప్రాంతాల శాసనసభల మహిళా సాధికారత కమిటీల చారిత్రక మొదటి జాతీయ సదస్సును తిరుపతిలోని రాహుల్ కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం ఓం బిర్లా ప్రారంభించారు. ఈనెల 14, 15 తేదీలలో రెండు రోజుల పాటు జరగనున్న ఈ సదస్సును జాతీయ గీతం, రాష్ట్ర గీతాలాపన అనంతరం పార్లమెంటరీ మహిళా సాధికారత కమిటీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, రాజ్యసభ వైస్‌చైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్, ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఉప సభాపతి రఘురామ కృష్ణరాజు, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక, శాసనసభ వ్యవహారాల శాఖా మంత్రి పయ్యావుల కేశవ్, రాష్ట్ర మహిళా సంక్షేమ కమిటీ చైర్పర్సన్ గౌరు చరితారెడ్డి, ఆంధ్రప్రదేశ్ శాసన వ్యవస్థ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ సూర్య దేవరలతో కలిసి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

జ్యోతి ప్రజ్వలన అనంతరం వేదికపై ఉన్న లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ వైస్‌చైర్మన్ తదితర ప్రముఖులకు శాసనసభ సభాపతి, ఉప సభాపతి లు శాలువాలు కప్పి, శ్రీవారి చిత్రపటాలను బహుకరించారు. లోక్‌సభ సెక్రటేరియట్ ద్వారా ప్రచురించిన సదస్సుకు సంబంధించిన సావనీర్‌ను లోక్‌సభ స్పీకర్ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా మాట్లాడుతూ.. భారతదేశం వికసిత్ భారత్‌గా మారాలంటే మహిళా సాధికారత, బాలల సంక్షేమమే పునాది కావాలని పేర్కొన్నారు. మన కుమార్తెలు చదువుకొని స్వావలంబన సాధిస్తేనే భారతదేశం సమగ్ర, అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందని స్పష్టం చేశారు. ఈ రెండురోజుల సదస్సు వికసిత్ భారత్ కోసం మహిళా ఆధ్వర్యంలోని అభివృద్ధి.. అనే ప్రధాన అంశంతో జరుగుతోందన్నారు. ఇందులో జెండర్ రెస్పాన్సివ్ బడ్జెటింగ్ (లింగానుసార అనుకూల బడ్జెట్), కొత్త సాంకేతిక సవాళ్లను ఎదుర్కొనేందుకు మహిళలకు సాధికారత అంశాలపై ప్రత్యేక చర్చలు జరుగుతున్నాయన్నారు. మహిళల సాధికారత అనేది ఒకేసారి జరిగే కార్యాచరణ కాదని, నిరంతర ప్రక్రియన్నారు. గ్రామపంచాయతీ నుండి పార్లమెంట్ వరకు మహిళల ప్రాతినిధ్యం పెరగాలని సూచించారు. అమృత్ కాలంలో నారీ శక్తి దేశాన్ని సమగ్రత, శక్తివంతమైన భవిష్యత్తు వైపు నడిపించే అప్రతిహత శక్తిగా రూపుదిద్దుకుంటోందన్నారు. మహిళల సమానత్వం, నాయకత్వం, భాగస్వామ్యం – న్యాయం మాత్రమే కాకుండా, సమగ్ర, స్థిరమైన అభివృద్ధికి పునాది అని స్పష్టం చేశారు.

మహిళల కృషి, చారిత్రక నేపథ్యాన్ని వివరిస్తూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగం, ధైర్యం భారత సమాజాన్ని సమానత్వ దిశగా నడిపిందన్నారు. రాజ్యాంగ సభలో 15 మంది మహిళలు పాల్గొని భారత రాజ్యాంగాన్ని లింగ సమానత్వానికి అనుగుణంగా రూపొందించారన్నారు. గార్గి, అనసూయ వంటి పండితులను, రాణి రుద్రమదేవి, రాణి లక్ష్మీబాయి వంటి యోధులను, నేటి శాస్త్ర, సాంకేతిక, క్రీడలు, రాజకీయ రంగాలలోనూ మహిళల పాత్రను గర్వంగా గుర్తుచేశారు. నారీ శక్తి వందన్ అధినియమం (మహిళలకు శాసనసభలలో రిజర్వేషన్) చారిత్రక చట్టంగా పేర్కొన్నారు. సదస్సు ప్రాముఖ్యతను వివరిస్తూ పార్లమెంట్, రాష్ట్ర శాసనసభల మహిళా సాధికారత కమిటీల ప్రతినిధులు, 20కి పైగా రాష్ట్రాల నుండి నాయకులు పాల్గొన్నారన్నారు. ఈ కమిటీలు పార్టీ రహిత విధానంలో పని చేస్తూ, మహిళలు, పిల్లలు చివరి గ్రామం వరకూ లబ్ధి పొందేలా చట్టాలు, పథకాలు అమలు అయ్యేలా పర్యవేక్షిస్తాయని చెప్పారు.

సదస్సు ప్రారంభానికి ముందు ఓం బిర్లా తిరుమలలో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తిరుపతి క్షేత్రం భక్తి, త్యాగం, మహిళా కృషికి ప్రతీక అయినందున ఈ సదస్సు నిర్వహణకు ఇది సరైన ప్రదేశమని స్పీకర్ వ్యాఖ్యానించారు.

సభ ప్రారంభానికి ముందు సదస్సు ప్రాంగణానికి చేరుకున్న లోక్‌సభ స్పీకర్‌కు రాజ్యసభ ఉపాధ్యక్షుడు హరివంశ్, శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు, ఉప సభాపతి, మంత్రి పయ్యావుల, గౌరు చరితారెడ్డి, ప్రసన్నకుమార్ సూర్యదేవర స్వాగతం పలికారు. తరువాత పోలీస్ గౌరవ వందనాన్ని లోక్‌సభ స్పీకర్‌స్వీకరించారు. అనంతరం లోక్‌సభ స్పీకర్ కు తిరుపతి ఎంపీ గురుమూర్తి, చిత్తూరు ఎంపీ దగ్గుమల్ల ప్రసాద్ రావు, చంద్రగిరి, తిరుపతి, శ్రీకాళహస్తి, పూతలపట్టు, సత్యవేడు, నగరి, వెంకటగిరి, ఎం.ఎల్.ఎ లు, తుడా చైర్మన్ పుష్ప గుచ్ఛాలు అందించి, శాలువాలు కప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాష్ట్ర హెూమ్ మినిస్టర్ వంగలపూడి అనిత, బీసీ వెల్ఫేర్, చేనేత జౌళి శాఖల మంత్రి సవిత, స్త్రీ,శిశు సంక్షేమ,గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణిలను లోక్‌సభ స్పీకర్‌కు రాష్ట్ర స్పీకర్ అయ్యన్న పాత్రుడు పరిచయం చేశారు. లోక్‌సభ స్పీకర్ కు జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్, నగరపాలక సంస్థ కమీషనర్ ఎన్.మౌర్యపుష్ప గుచ్ఛాలు అందించారు. అనంతరం వివిధ రాష్ట్రాలకు చెందిన కమిటీ సభ్యులతో కలిసి గ్రూప్ ఫోటో దిగారు. తదనంతరం ఫోటో ఎగ్జిబిషన్ ను ప్రారంభించి సభ్యులతో కలసి తిలకించారు.

# మహిళా సాధికారతకు ఎన్టీఆర్ ఎనలేని కృషి

- సీఎం చంద్రబాబు విజన్‌తో టెక్నాలజీ హబ్‌గా ఏపీ
- రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్



తిరుపతి (చైతన్యరథం): మహిళా సాధికారత కోసం దివంగత ఎన్టీఆర్ ఎంతో కృషి చేశారని.. ఆయనకు ప్రణామాలని రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ సింగ్ అన్నారు. తిరుపతిలో నిర్వహించిన తొలి జాతీయ మహిళా సాధికారత సదస్సులో ఆదివారం హరివంశ్ సింగ్ మాట్లాడారు. అభివృద్ధి చెందిన ఎన్నో దేశాలు మహిళలకు ప్రాధాన్యత ఇచ్చాయని చెప్పారు. మహిళల సాధికారతకు ప్రధాని నరేంద్ర మోదీ అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు. బీహార్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో తొలిసారిగా మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేశామని హరివంశ్ తెలిపారు. జనధన్ యోజనలో సగానికి పైగా మహిళలకు ఖాతాలు ఉన్నాయని చెప్పారు. ఉమ్మడి ఏపీని టెక్నాలజీ హబ్‌గా తీర్చదిద్దడంలో సీఎం చంద్రబాబు కీలక పాత్ర పోషించారన్నారు. దేశంలోనే తొలిసారిగా నైపుణ్య గణనను ఏపీలో చేపట్టారని తెలిపారు. తిరుపతి జిల్లా శ్రీసిటీలోని పరిశ్రమల్లో సగానికి పైగా ఉద్యోగాల్లో మహిళలే పని చేస్తున్నారని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ స్వాతంత్ర్య సమరయోధులు, సాహితీవేత్తలు, ఆధ్యాత్మిక నాయకులకు ఈ సందర్భంగా ఆయన శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సదస్సును విజయవంతంగా నిర్వహించినందుకు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్, రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

### *మహిళల సాధికారతతోనే అభివృద్ధి: పురందేశ్వరి*



భారత పార్లమెంట్ మహిళా సాధికారత కమిటీ చైర్‌పర్సన్ పురందేశ్వరి మాట్లాడుతూ.. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాలను సాధించడంలో సమానత్వం, సమ్మిళితత్వం, సాధికారత ప్రాముఖ్యతను వివరించారు. మహిళా నేతృత్వంలోని అభివృద్ధి భారతదేశ జాతీయ వ్యూహంలో ఒక ముఖ్యమైన అంశమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీజీ పేర్కొన్నారన్నారు. విద్య, పారిశ్రామికత, ఆరోగ్యం, డిజిటల్ అక్షరాస్యత ద్వారా మహిళలను ప్రోత్సహించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, బేటీ బచావో, బేటీ పడావో, స్టాండప్ ఇండియా, మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికేట్, ప్రధానమంత్రి జన్ ధన్ యోజన వంటి పథకాల అమలు ద్వారా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారని తెలిపారు. స్వాతంత్ర్య పోరాటంలో రాణి లక్ష్మీబాయి, సరోజినీ నాయుడు వంటి మహిళల పాత్రను, మహిళలకు ఉన్న సామర్థ్యంను వివరించారు.

ప్రభుత్వం మహిళల అభివృద్ధి కోసం అనేక చర్యలు తీసుకుంటోందని, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లను పరిష్కరించడానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ కృషి చేస్తోందని తెలిపారు. అదేవిధంగా విద్య, డిజిటల్ రంగం, ఉద్యోగ అవకాశాలు, నాయకత్వ స్థానాల్లో మహిళల ప్రాతినిధ్యం పెంచడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. గృహ హింస చట్టం, లైంగిక వేధింపుల నిరోధక చట్టం వంటి చట్టాలను సమర్థ వంతంగా అమలు చేయాలని కోరారు. 1997లో మహిళా సాధికారత కమిటీని ఏర్పాటు చేశారని, ఈ కమిటీ మహిళలకు సంబంధించిన అనేక సమస్యలపై 87 నివేదికలను సమర్పించిందని తెలిపారు. కమిటీ తన సిఫార్సుల ద్వారా విధానపరమైన మార్పులకు దోహదపడిందని పేర్కొన్నారు. మహిళా సాధికారత కమిటీల చైర్ పర్సన్లను ఒకే వేదికపైకి తీసుకు రావడం ద్వారా అనుభవాలను పంచుకోవడానికి, ఉత్తమ విధానాలను మార్పిడి చేసుకోవడానికి, సవాళ్లను పరిష్కరించడానికి సూచనలు చేయడానికి ఒక వేదికగా ఈ సదస్సు అవకాశం కల్పిస్తుందని తెలిపారు. మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మాటలను గుర్తు చేస్తూ స్త్రీలకు సమానత్వం, న్యాయం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.

### *సమగ్ర చర్చకు వేదిక: గౌర చరితారెడ్డి*



రాష్ట్ర మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమం, సాధికారత కమిటీ చైర్ పర్సన్ గౌరు చరితా రెడ్డి స్వాగతోపన్యాసం చేస్తూ ఈ సదస్సు దేశవ్యాప్తంగా మహిళా సాధికారత విధానాలు, కార్యక్రమాల గురించి తెలుసుకోవడానికి, అనుభవాలు పంచుకోవడానికి, సవాళ్లపై చర్చించడానికి ఒక వేదికగా ఉపయోగపడుతుందన్నారు. మహిళలు, చిన్నారులు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమం కోసం కమిటీ చేస్తున్న కృషిని తెలియజేస్తూ, మరింత మెరుగైన విధానాల అమలుకు అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కమిటీ 1993 డిసెంబర్ 29న ఏర్పాటై మహిళలు, చిన్నారుల సంక్షేమం, హక్కులు, రక్షణ, సాధికారతపై దృష్టి పెట్టిందన్నారు. మహిళలకు సురక్షిత వాతావరణం, విస్తృత అవకాశాలు, నాణ్యమైన విద్య, ఆరోగ్య సేవలు, దివ్యాంగులకు గౌరవం, సమాన అవకాశాలు, వయోవృద్ధులకు భద్రత కల్పించడం కమిటీ లక్ష్యాలన్నారు. విధానాల రూపకల్పన, సవరణలు, కొత్త కార్యక్రమాల అమలుపై సిఫార్సులను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. రాష్ట్రాలుగా విభజింపబడినప్పటికీ, మహిళలు, పిల్లల రక్షణ, దివ్యాంగుల సాధికారత, వయోవృద్ధుల భద్రత కోసం దేశం మొత్తం ఒకటిగా కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. సమగ్ర విధానాలను ప్రోత్సహించి, తగిన వనరులు కేటాయించి, వ్యవస్థలను బలోపేతం చేయాలని కోరారు. రాష్ట్ర సీఎం చంద్రబాబు మహిళా సాధికారతకు పెద్ద పీట వేయడం, "డెవలప్మెంట్ నీడ్స్ ఉమెన్" అనే నినాదంతో పరిపాలన చేస్తున్నారని ప్రశంసించారు.

### *చారిత్రాత్మకమైన ఘట్టం: డిప్యూటీ స్పీకర్ రఘురామ*



ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు సభకు హాజరైన వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి మహిళా సాధికారత కమిటీలను పార్లమెంటరీ మహిళా సాధికారత కమిటీతో కలిపి, పవిత్రక్షేత్రమైన తిరుపతిలో ఈ సమావేశం నిర్వహించడం ఒక చారిత్రాత్మకమైన గట్టం అన్నారు. లోకసభ స్పీకర్ ఓం బిర్లా ఆలోచన వల్లే ఈ విధమైన అద్భుతమైన కార్యక్రమం సాధ్యమైందన్నారు. అంతేకాకుండా, మన మహోనీయ నాయకుడు ఎన్టీ రామారావు ఇక్కడే పద్మావతి మహిళా విశ్వవిద్యాలయాన్ని స్థాపించిన ప్రదేశంలోనే ఈ సదస్సు నిర్వహించడం ఈ కార్యక్రమానికి మరింత విశిష్టతను తెచ్చిందన్నారు. లోకసభ స్పీకర్ బిర్లా, రాజ్యసభ ఉపాధ్యక్షుడు హరివంశ్, భారత పార్లమెంట్ మహిళా సాధికారత కమిటీ చైర్‌పర్సన్ పురందేశ్వరి పాల్గొనడం ఈ సదస్సుకు మరింత వెలుగును తెచ్చాయన్నారు. మన రాష్ట్రానికి చెందిన అనేక మంది పెద్దలు, మంత్రులు, సహచరులు ఇక్కడ పాల్గొనడం, నిజంగా ఒక చారిత్రక ఘట్టం అని కొనియాడారు. మన రాష్ట్రంలో మహిళలకు సమాన హక్కులు, ప్రాతినిధ్యం కల్పించడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి గురించి హరివంశ్ విశేషంగా ప్రస్తావించడం చాలా గర్వకారణమన్నారు. మహిళలకు 33% రిజర్వేషన్ ఒక మైలురాయని, కానీ భవిష్యత్తులో రిజర్వేషన్ల అవసరం లేకుండా, మహిళలు 50% కంటే ఎక్కువ ప్రాతినిధ్యం పొందే రోజు రావాలని తాను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానన్నారు.

ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల డెలిగేట్లు, గూడూరు, సూళ్లూరుపేట, జి.డి. నెల్లూరు, రాప్తాడు, ఆళ్లగడ్డ, కడప ఎమ్మెల్యేలు, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, తిరుపతి బ్యూటిఫికేషన్ చైర్మన్ సుగుణమ్మ, రాష్ట్ర మీడియా కో ఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, జిల్లా అధికారులు, రాష్ట్ర శాసన వ్యవస్థకు సంబందించిన అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మరింత బలంగా మహిళా వాణి

- పార్టీలకతీతంగా వారి సాధికారతకు కృషి
- అసెంబ్లీకి రాని ఎమ్మెల్యేల విషయంలో లోక్‌సభ స్పీకర్ మార్గనిర్దేశం అవసరం
- సభకు రాకుండా జీతాలెలా తీసుకుంటారు
- జాతీయ మహిళా సాధికారత సదస్సులో స్పీకర్ అయ్యన్నపాత్రుడు

తిరుపతి (చైతన్యరథం): మహిళా సాధికారత కోసం పార్టీలకతీతంగా కృషి చేయాలని రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పిలుపు ఇచ్చారు. తిరుపతిలో ఆదివారం ప్రారంభమైన రెండు రోజుల జాతీయ మహిళా సాధికారత సదస్సులో తొలిరోజు ఆయన మాట్లాడుతూ దేశంలోని మహిళా ప్రజాప్రతినిధులందరినీ పవిత్ర క్షేత్రం తిరుపతిలో ఒకే వేదికపై సమావేశపరిచే అవకాశం కల్పించినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి కృతజ్ఞతలు తెలిపారు. దేశ స్వాతంత్ర్య సమరంలోనూ, రాజ్యాంగ నిర్మాణంలోనూ మహిళలు ముందంజలో ఉన్నారని, నేడు రాజకీయాల నుంచి సమాజాభివృద్ధి వరకు అన్ని రంగాల్లో వారు ముద్ర వేశారని చెప్పారు. అయినా మహిళా వాణి మరింత బలంగా వినిపించాలనే అవసరం ఉందన్నారు.



### ఆదర్శంగా ఏపీ

మహిళలకు తండ్రి ఆస్తిలో సగం వాటా కల్పించిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని ఉద్ఘాటించారు. గతంలో ముఖ్యమంత్రిగా నందమూరి తారక రామారావు ఉన్నప్పుడు మహిళల ఆస్తి హక్కు గురించి చట్టం చేశారని, అదే విధంగా శాసనసభలో మహిళలకు ప్రాతినిధ్యం కల్పించిన దూరదృష్టి గల నేతగా ఆయనను గుర్తుచేశారు. ఆడపిల్లలు చదువుకోవాలని ఇదే తిరుపతిలో పద్మావతి మహిళా యూనివర్సిటీ ఏర్పాటు చేసిన ఘనత కూడా ఆయనదే. తరువాతి కాలంలో స్వయం సహాయక బృందాల బలోపేతం, స్వయం ఉపాధి అవకాశాల కల్పన, మహిళా ప్రాతినిధ్యాన్ని ప్రోత్సహించడంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషిని ఆయన్నపాత్రుడు ప్రస్తావించారు. 1999లో రాష్ట్ర తొలి మహిళా స్పీకర్‌గా ప్రతిభాభారతిని ఎన్నుకోవడం ఆయన దూరదృష్టికి నిదర్శనమని పేర్కొన్నారు. ఒక మహిళను అసెంబ్లీకి స్పీకర్ చేసిన ఆంధ్రప్రదేశ్.. మిగిలిన రాష్ట్రాలకు ఆదర్శప్రాయమని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ హెూం మినిస్టర్‌గా వంగలపూడి అనితను సదస్సుకు పరిచయం చేశారు. ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గంలో ముగ్గురు మహిళలకు సీఎం చంద్రబాబు స్థానం కల్పించారని ఉద్ఘాటించారు. మిగిలిన రాష్ట్రాలు కూడా ఈ విషయాన్ని ఆదర్శంగా తీసుకోవాలని అయ్యన్నపాత్రుడు సూచించారు.

### సభకు రాకుండా జీతాలా?

శాసనసభల పని తీరు గురించి మాట్లాడుతూ ప్రజలు మన మీద ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయకూడదు.. ప్రజా ప్రతినిధుల ప్రవర్తన సమాజానికి ఆదర్శంగా ఉండాలన్నారు. కొందరు ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రాకపోయినా జీతం తీసుకుంటున్నారని స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. ప్రజలు మనల్ని ఎన్నుకున్నది ప్రజా సమస్యలు పరిష్కరించడానికే. ఉద్యోగాలకు రాకపోతే ఉద్యోగులపై చర్యలు తీసుకుంటున్నాం. చిరుద్యోగులు సైతం 'నో వర్క్ – నో పే' విధానం అనుసరిస్తున్నారు. ఎమ్మెల్యేలకి అది వర్తించదా. అసెంబ్లీకి రాకపోతే తీసుకోవాల్సిన చర్యలపై లోక్‌సభ స్పీకర్ మార్గదర్శకాలు ఇవ్వాలి. ఏడాదిలో అసెంబ్లీ సమావేశాలు జరిగేదే 45 రోజులు.. వాటికి కూడా రాకపోతే ఎలా అని అయ్యన్నపాత్రుడు ప్రశ్నించారు. దేశంలోని అసెంబ్లీలు ఏడాదిలో కనీసం 60 రోజులు సమావేశాలు జరపాలని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజాప్రతినిధుల ప్రవర్తన సమాజానికి ఆదర్శప్రాయంగా ఉండాలని సూచించారు.

### మహిళా స్వశక్తీకరణకు ప్రాధాన్యత: మంత్రి పయ్యావుల



రాష్ట్ర శాసన వ్యవహారాల శాఖా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ ఈ సదస్సు మహిళలకు భద్రత, విద్య, నైపుణ్యాలు, అభివృద్ధిలో సమాన భాగస్వామ్యాన్ని కల్పించే దిశగా చట్టసభ్యులందరినీ ఏకం చేస్తుందని తెలిపారు. ఇది వికసిత్ భారత్–2047, స్వర్ణ ఆంధ్ర–2047 లక్ష్యాల వైపు ఒక ముఖ్యమైన అడుగుగా నిలుస్తుందని అన్నారు.

దేశవ్యాప్తంగా చట్టసభ్యులు ఒకచోట చేరి మహిళా శక్తీకరణపై చర్చించడం ద్వారా కేవలం సామాజిక న్యాయం మాత్రమే కాకుండా అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణానికి పునాది అవుతుందని పేర్కొన్నారు. భారత ప్రభుత్వం వికసిత్ భారత్–2047 లక్ష్యాన్ని మన ముందుకు ఉంచిందని, స్వాతంత్ర్యం శతాబ్దోత్సవానికి బలమైన, సమగ్రత కలిగిన అభివృద్ధి చెందిన దేశంగా నిలవాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. ఈ దిశలో మహిళా స్వశక్తీకరణకు ప్రత్యేక ప్రాధాన్యం ఉందని, బేటీ బచావో–బేటీ పడావో, మిషన్ శక్తి, వన్ స్టాప్ సెంటర్స్, మహిళా హెల్ప్‌లైన్, వర్కింగ్ ఉమెన్ హాస్టల్స్, పని స్థల సురక్షిత పథకాలు వంటి పథకాల ద్వారా మహిళలకు భద్రత, గౌరవం, అభివృద్ధి అవకాశాలు కల్పిస్తున్నామని వివరించారు.

స్వర్ణ ఆంధ్ర–2047 సాధనలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి, నాయకత్వం ముఖ్యమని, సంక్షేమం, శక్తీకరణ కలిసిన రోడ్‌మ్యాప్‌తో రాష్ట్రం ముందుకు వెళ్తోందని తెలిపారు. స్వర్ణ ఆంధ్ర–2047 ద్వారా మహిళలకు ఆరోగ్యం, పోషణ, భద్రత, సామాజిక రక్షణతో పాటు నైపుణ్యాధారిత విద్య, యూనివర్సల్ స్కూల్ చేరిక, డిజిటల్ క్లాస్‌రూమ్స్, స్కిల్ హబ్‌లు, టెక్నాలజీ ఆధారిత వైద్యం, ప్రసూతి ఆరోగ్యం, అనీమియా తగ్గింపు వంటి పథకాలు అమలవుతున్నాయని తద్వారా ప్రతి బాలికకు చదువు, ప్రతి మహిళకు భద్రత, ప్రతి తల్లికి ఆరోగ్యం, ప్రతి పారిశ్రామికవేత్తకు మార్కెట్, రుణాలు అందుబాటులో ఉంటాయన్నారు.

ప్రపంచంలో వేగంగా మారుతున్న ఏఐ, బయోటెక్నాలజీ, డిజిటల్ ఎకానమీలో మహిళలు వెనుకబడకూడదని, అందుకే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డిజిటల్ లిటరసీ, స్టెమ్ (ఎస్‌టీఈఎం) విద్య, క్వాంటం కంప్యూటింగ్ వంటి కొత్త నైపుణ్యాలలో పెట్టుబడులు పెడుతోందని వివరించారు. అయితే నిజమైన స్వ శక్తీకరణ పథకాల ద్వారానే కాదు, మనసులోని కచ్చితమైన మార్పు ద్వారానే ఇది సాధ్యమని, మహిళలను లబ్ధిదారులుగా కాకుండా సహభాగస్వాములుగా, నాయకులుగా చూడాల్సిన అవసరం ఉందన్నారు.

భారతదేశంలోని ప్రతి మహిళ సురక్షితంగా, విద్యావంతులుగా, నైపుణ్యం కలిగి, శక్తివంతంగా ఉంటే వికసిత్ భారత్–2047, స్వర్ణ ఆంధ్ర–2047 లక్ష్యాలు తప్పక సాధ్యమవుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. చివరగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ప్రజల తరపున సదస్సుకు విచ్చేసిన ప్రతి ఒక్కరికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

# రాష్ట్రానికి భారీ ఎత్తున పెట్టుబడులు

- గ్లోబల్ సమ్మిట్‌లో ప్రపంచ దేశాలను ఆకట్టుకున్నాం
- అవసమైనంత మేరకే యూరియా వినియోగించాలి
- పైడితల్లి అమ్మవారి పండగను ఘనంగా నిర్వహిస్తాం
- రాష్ట్ర ఎంఎస్ఎంఈ శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్




విజయనగరం (చైతన్యరథం): గ్లోబల్ సమ్మిట్‌లో ప్రపంచ దేశాలను ఆకట్టుకున్నామని, త్వరలో రాష్ట్రానికి భారీ ఎత్తున పెట్టుబడులు వస్తాయని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక బ్రాండ్ అని, ఆయన్ను చూసే రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమవుతున్నారని కొనియాడారు. విజయనగరంలోని తమ క్యాంపు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన దావోస్ సదస్సులో ప్రపంచ దేశాలను, పెట్టుబడుదారులను ఆకర్షించడంలో సఫలీకృతం అయ్యామని తెలిపారు. జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్‌లో జరిగిన సదస్సులో కూడా సత్ఫలితాలు వచ్చాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, యువనేత, మంత్రి నారా లోకేష్ సారధ్యంలోని కూటమి ప్రభుత్వం.. రాష్ట్రంలో వ్యాపారవేత్తలు పెట్టుబడులు పెట్టేవిధంగా భరోసాను నింపిందని అన్నారు. నవంబరు 14, 15 తేదీల్లో విశాఖపట్నంలో జరిగే గ్లోబల్ సమ్మిట్‌లో మరింతగా పెట్టుబడులను ఆకర్షించేందుకు కృషి జరుగుతోందని తెలిపారు. ఇప్పటికే సుమారు 11 లక్షల కోట్ల పెట్టుబడులు సిద్ధంగా ఉన్నాయని, ఇవన్నీ కార్యరూపం దాల్చి ఫలితాలను ఇవ్వడానికి కొంత సమయం పడుతుందని చెప్పారు. యువతకు ఉపాధి కల్పించేందుకు పెద్ద ఎత్తున ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. దీనిలో భాగంగానే గ్రామీణ ప్రాంత యువతను దృష్టిలో పెట్టుకొని ప్రతీ నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్కును ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. మొత్తం 175 ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేయడం ప్రభుత్వ లక్ష్యమని, వీటిలో ఇప్పటికే 50 పార్కులకు శంకుస్థాపన చేశామని త్వరలో మరికొన్నింటికి శంకుస్థాపన చేస్తామని తెలిపారు. 11పార్కుల్లో ప్లాట్ల కేటాయింపు కూడా జరుగుతోందన్నారు. రక్షణ రంగం, స్పేస్ టెక్నాలజీ, డ్రోన్స్ తదితర రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని వివరించారు.

### బీమాతో అందరికీ ఆరోగ్య భరోసా

మెరుగైన వైద్య సదుపాయాలను వీలైనంత త్వరగా ప్రజలకు అందించే లక్ష్యంతోనే వైద్య కళాశాలలను పీపీపీ పద్ధతిలో నిర్మించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి స్పష్టం చేశారు. భోగాపురం విమానాశ్రయం, పోర్టులు, జాతీయ రహదారులు, భారీ ప్రాజెక్టులను పీపీపీ పద్ధతిలో నిర్మిస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. గత ప్రభుత్వ హయాంలో వైద్య రంగం నిర్వీర్యం అయ్యిందని, మౌలిక సదుపాయాల కల్పన పడకేసిందని మంత్రి విమర్శించారు. తమ పార్టీ హయాంలోనే గతంలో కూడా రాష్ట్రానికి అత్యధికంగా మెడికల్ సీట్లు వచ్చాయని చెప్పారు. ఆరోగ్య బీమా పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టనుందని, దీనివల్ల ప్రతీఒక్కరికీ ఆరోగ్య భరోసా కలుగుతుందని పేర్కొన్నారు.

### అమరావతిపై వైసీపీ రోజుకో మాట

రాష్ట్ర రాజధాని అమరావతి విషయంలో తాము ముందునుంచీ ఒకే విధానంలో ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. ప్రతిపక్ష పార్టీకి ఈ విషయంలో స్పష్టత లేదని, రోజుకో మాట చెబుతోందని అన్నారు. ఆటో, టాక్సీ డ్రైవర్లకు ఆర్థిక సాయం అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించడం శుభకరమని పేర్కొన్నారు. ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్‌ను అమలు చేశామని, ఈ విషయంలో రాష్ట్ర ప్రజలంతా ఎంతో సంతోషంగా ఉన్నారని చెప్పారు. అనంతపురంలో జరిగిన భారీ సభే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. త్వరలో రాష్ట్రానికి 50వేల మెట్రిక్ టన్నుల యూరియా రానుందని మంత్రి చెప్పారు. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా అధికంగా యూరియాను వినియోగించడం మంచిది కాదన్నారు. కేన్సర్, కిడ్నీ సమస్యలు తదితర వ్యాధుల విజృంభణకు కొంతవరకు అధిక యూరియా కారణమై ఉండవచ్చునన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించిన మేరకు మాత్రమే యూరియాను వినియోగించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. ఉత్తరాంధ్ర కల్పవల్లి విజయనగరం పైడితల్లి అమ్మవారి పండుగను మునుపటి ఏడాదివలే ఈ ఏడాది కూడా భారీ ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి శ్రీనివాస్ తెలిపారు.

## శ్రీవారిని దర్శించుకున్న లోక్‌సభ స్పీకర్



తిరుమల(చైతన్యరథం): తిరుమల శ్రీవారిని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్‌సింగ్ ఆదివారం ఉదయం దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న వారికి టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు, అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ధ్వజస్తంభానికి నమస్కరించి ఆ తరువాత మూలమూర్తి దర్శనం చేసుకున్నారు. దర్శనానంతరం రంగనాయక మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఈ సందర్భం గా టీటీడీ చైర్మన్, అదనపు ఈవో తీర్థప్రసాదాలు, శ్రీవారి చిత్రపటం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, రాజ్యసభ ఎంపీ సుధా నారాయణమూర్తి పాల్గొన్నారు.

## ఆప్కాబ్‌కు జాతీయ స్థాయి గౌరవం

- కోఆపరేటివ్ స్టక్చర్‌లో రెండవ బహుమతి
- సిమ్లా జాతీయ సదస్సులో ప్రదానం



అమరావతి (చైతన్యరథం): ఏపీ రాష్ట్ర సహకార బ్యాంక్ (ఆప్కాబ్) మరోసారి రాష్ట్రానికి గౌరవం తెచ్చింది. సహకార రంగంలో ప్రతిభ కనబరిచినందుకు 2024-25 ఆర్థిక సంవత్సరానికి త్రీ టైర్ కోఆపరేటివ్ స్ట్రక్చర్‌లో రెండవ బహుమతి ఆప్కాబ్‌కు లభించింది. సెప్టెంబరు 13, 14 తేదీల్లో సిమ్లాలో జరిగిన జాతీయ సహకార సదస్సులో ఈ అవార్డు అందుకున్నారు. ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు ఈ పురస్కారాన్ని ఇఫ్కో చైర్మన్, ఎన్సీయూఐ అధ్యక్షుడు దిలీప్ సాంఘానీ చేతులమీదుగా స్వీకరించారు. ఈ సందర్భంగా ఎన్ఏఎఫ్ఎస్‌సీఓబీ చైర్మన్ కొండూరు రవీంద్రరావు, ఎండీ భీమసుబ్రహ్మణ్యం, హిమాచల్‌ప్రదేశ్ స్టేట్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ దేవేందర్ తదితరులు హాజరయ్యారు. ఆప్కాబ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 2015లో రాష్ట్ర విభజన తర్వాత కేవలం రెండు బ్రాంచీలతో రూ.7,967 కోట్ల వ్యాపారంతో నిలిచిపోయిన ఆప్కాబ్‌కు ఆ దశలో పరిస్థితి అత్యంత క్లిష్టంగా మారింది. స్థిరమైన ప్రధాన కార్యాలయం లేకపోవడం, సీనియర్ అధికారుల కొరత, టెక్నాలజీ పరంగా తెలంగాణపై ఆధారపడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. అయితే ఈ క్లిష్టతను అవలీలగా జయించి, కేవలం దశాబ్ద కాలంలోనే బ్యాంక్ అద్భుతమైన ఎదుగుదల సాధించింది. 2020 నాటికి వ్యాపార పరిమాణం రూ.15,596 కోట్లు దాటగా, 2025 మార్చి నాటికి అది మరింతగా పెరిగి రూ.46,430 కోట్లు చేరింది. ఇందులో రూ.11,002 కోట్లు డిపాజిట్లు, రూ.35,428 కోట్లు రుణాలు ఉన్నాయి. ఈ అభివృద్ధి వెనుక ప్రధాన బలంగా నిలిచింది టెక్నాలజీ ఆధారిత మార్పులు. అన్ని 13 జిల్లా సహకార కేంద్ర బ్యాంకులను కోర్ బ్యాంకింగ్ సిస్టమ్‌లో ఏకీకృతం చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా 465 బ్రాంచీలను ఒకే వేదికపైకి తెచ్చారు. ముఖ్యంగా పీఏసీఎస్ కంప్యూటరైజేషన్ ప్రాజెక్ట్ ద్వారా ఆప్కాబ్ దేశంలోనే సిస్టమ్ ఇంటిగ్రేటర్ పాత్ర పోషించిన మొదటి స్టేట్ కోఆపరేటివ్ బ్యాంక్‌గా చరిత్రలోకెక్కింది. పీఏసీఎస్‌లలో 99.7 శాతం డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లోకి మార్చి హార్డ్‌వేర్ కిట్లు, ఆధార్ ఆధారిత కేవైసీ, డిజిటల్ పాస్‌బుక్‌లు, పీవోఎస్ పరికరాలు అందజేశారు. డాష్‌బోర్డ్ సిస్టమ్ ద్వారా పీఏసీఎస్ ఆర్థిక లావాదేవీలు, ఎన్‌పీఏలు, సభ్యత్వ వివరాలు, మౌలిక వసతులు తక్షణమే గమనించగల విధానం ఏర్పడింది.

# పదవులను బాధ్యతగా భావించాలి

- పురపాలక మంత్రి నారాయణ



నెల్లూరు (చైతన్యరథం): పదవులు కేవలం అధికారం కోసమే అనుకోకుండా వాటిని బాధ్యతగా భావించాలని పురపాలక మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. నెల్లూరులో ఇటీవల నామినేటెడ్ పదవులు పొందిన వారికి మంత్రి నారాయణ శుభాకాంక్షలు తెలిపారు. నెల్లూరులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆదివారం జరిగిన ప్రత్యేక సమావేశంలో నామినేటెడ్ పదవులు దక్కించుకున్న కొందరు మంత్రిని కలిసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. వారితో మంత్రి నారాయణ మాట్లాడుతూ పదవులను బాధ్యతగా భావించి ప్రజల కోసం పనిచేయాలని సూచించారు. పోరాటం, కష్టం, త్యాగం, పనితీరు, విధేయత, క్రమశిక్షణ ఆధారంగా పదవులు ఇచ్చామని వెల్లడించారు.. సమర్థత చాటిన బూత్ స్థాయి కార్యకర్తలకు రాష్ట్ర స్థాయి పదవులు ఇచ్చామన్నారు. పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు, నాయకుడికి సముచిత స్థానం ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో పదవులు దక్కించుకున్న కప్పిర శ్రీనివాసులు, ఉచ్చి భువనేశ్వర ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు మంత్రి నారాయణను పూల బొకేలతో, శాలువలతో ఘనంగా సత్కరించి.. కృతజ్ఞతలు తెలిపారు. మీరు మాపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెడతామని వారు మంత్రికి హామీ ఇచ్చారు.. అనంతరం నగరంలోని కార్యకర్తలతో మంత్రి నారాయణ సమీక్ష సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేసారు. ప్రజలకు ఎల్లప్పుడూ కార్యకర్తలు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. అనంతరం టీడీపీ సీనియర్ నాయకుడు వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డిని నూతనంగా నామినేటెడ్ పదవులు పొందిన పలువురు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ సివిల్ సివిల్ సప్లయిస్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, టీడీపీ సీనియర్ నేత విజయ భాస్కర్ రెడ్డి, నగర అధ్యక్షుడు మామిడాల మధు, మాజీ జడ్పీటీసీ విజేత రెడ్డి, టీడీపీ ముఖ్య నేతలు, తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయండి

- సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్సీల లేఖ

అమరావతి(చైతన్యరథం): గత ప్రభుత్వంలో 2024-25 పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు రీయింబర్సుమెంటు బకాయిని విడుదల చేయాలని సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్సీలు కంచర్ల శ్రీకాంత్, భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, పి.రాజశేఖర్, ఆలపాటి రాజేంద్రప్రసాద్, వేపాడ చిరంజీవి విజ్ఞప్తిచేశారు. గత వారం నుంచి కాలేజీ యాజమాన్యాలు ఆర్థిక ఇబ్బందుల విషయాలు తెలుపుతూ ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వడానికి ఇబ్బంది పడుతున్నారు.

విద్యార్థుల పెండింగ్ రీయింబర్సుమెంట్ ట్యూషన్ ఫీజులు విడుదల చేయించమని ఒత్తిడి తెస్తున్నారు. అందువల్ల గత సంవత్సరం 2024-25 పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు రీయింబర్సుమెంట్ బకాయిలు విడుదల చేయాలని, ఈ విద్యా సంవత్సరం 2025-26 సంబంధించి ఫీజుల విడుదల క్యాలెండర్‌ను ప్రకటించాలని కోరారు. నవ్యాంధ్రప్రదేశ్ కోసం శ్రమిస్తూ ఏపీని అభివృద్ధి పథం వైపు నడిపిస్తూ అంతర్జాతీయ కంపెనీల నుంచి పెట్టుబడులను ఆకర్షిస్తున్నారు..వాటికి అవసరమైన మానవ వనరులు సమకూర్చాలంటే ఉన్నత విద్యకు మంచి తోడ్పాటు అందించాలని లోకేష్ కష్టపడుతున్నారు..రాష్ట్రంలో ఉన్నత విద్యా సంస్థలు ఆర్థికంగా పటిష్ఠంగా ఉన్నప్పుడే నాణ్యమైన విద్యను అందించి కంపెనీల అవసరాలకు తగ్గట్టు విద్యార్థులు తయారు అవుతారని పేర్కొన్నారు.

# డబుల్ ఇంజన్ సర్కార్‌లో.. అభివృద్ధి పథంలో ఏపీ

- బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా



విశాఖపట్నం (చైతన్యరథం): ప్రధాని నరేంద్ర మోదీ, ఏపీ సీఎం చంద్రబాబు పాలనలో ఆంధ్రప్రదేశ్ ప్రగతి పథంలో నడుస్తోందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్రమంత్రి జేపీ నడ్డా ఉద్ఘాటించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ చేపట్టిన 'సారథ్యం' యాత్ర ముగింపు సభలో ఆదివారం నడ్డా మాట్లాడుతూ రాష్ట్రంలోని గత వైసీపీ ప్రభుత్వం.. అవినీతి, ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలు అవలంబించిందని విమర్శించారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అంధకారంలోకి వెళ్లిపోయింది. ఆ పార్టీ అవినీతి పాలనకు నరేంద్ర మోదీ, చంద్రబాబు చరమగీతం పాడారు. ఇప్పుడు ప్రధాని మోదీ పాలనలో దేశంతో పాటు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో నడుస్తున్నాయి. ఇదే స్ఫూర్తితో ముందుకు వెళ్లాలి. ఆంధ్ర ప్రజల గుండెల్లో మోదీ ఉన్నారు. ఆయన గుండెల్లో ఆంధ్రప్రదేశ్ ఉంది. రాష్ట్రంలో జాతీయ రహదారులు అభివృద్ధి చేశాం. విశాఖ, కాకినాడ, తిరుపతి స్మార్ట్ సిటీలుగా నిలుస్తున్నాయి. సాగర మాల పేరుతో 14 పోర్టులు నిర్మిస్తున్నాం. రాష్ట్రంలో పది కేంద్ర ప్రభుత్వ విద్యా సంస్థలు ఏర్పాటు చేశాం. కొత్తగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ తెచ్చాం. రాష్ట్రానికి పలు అమృత్ భారత్, వందే భారత్ రైళ్లు కేటాయించాం. ఓర్వకల్లు, కొప్పర్తి పారిశ్రామికవాడల అభివృద్ధికి నిధులు కేటాయించాం. విశాఖ, విజయవాడ నగరాల అభివృద్ధికి ఎంతగానో సహకరిస్తున్నాం. భోగాపురం విమానాశ్రయానికి రూ.625 కోట్ల నిధులు ఇస్తున్నాం. ఆరు కొత్త వైద్య సంస్థలు ప్రారంభించామని నడ్డా తెలిపారు.

ప్రస్తుతం సబ్ కా సాథ్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్ నినాదంతో ముందుకు వెళుతున్నామన్నారు. అయోధ్యలో రామ మందిరం నిర్మించాం. ట్రిపుల్ తలాక్‌ను రద్దు చేశాం. ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు జీఎస్టీ సంస్కరణలతో జనం జీవితాల్లో ముందుగానే దసరా, దీపావళి తీసుకొచ్చాం. ప్రపంచంలో అతి ఎక్కువ మంది ప్రజాప్రతినిధులు ఉన్న పార్టీ బీజేపీ. మోదీ నాయకత్వంలో 12 ఏళ్లుగా అభివృద్ధిలో ముందుకు వెళ్తున్నాం. త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించబోతుందని నడ్డా ధీమా వ్యక్తం చేశారు. 2014కు ముందు దేశంలో అసమర్థ, వారసత్వ రాజకీయాలు నడిచేవి. అప్పట్లో దేశంలో అవినీతి రాజ్యమేలింది. 2014కు ముందు ప్రజలను మభ్య పెట్టేందుకు మేనిఫెస్టో తీసుకొచ్చి ఎన్నికలయ్యాక మరిచిపోయేవారు. సైద్ధాంతిక పునాదులపై నిర్మాణమైన పార్టీ బీజేపీ" అని జేపీ నడ్డా స్పష్టం చేశారు.

# అల్పపీడనంతో నాలుగురోజులు వర్షాలు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి - విపత్తుల నిర్వహణ ఎండీ ప్రఖర్‌జైన్



అమరావతి(చైతన్యరథం): అల్పపీడనం, ద్రోణి ప్రభావంతో రాబోయే నాలుగురోజులు రాష్ట్రంలో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు..ఒకటి, రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్‌జైన్ తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఉరుములతో కూడిన వర్షాలు పడేటప్పుడు చెట్ల కింద నిలబడరాదని సూచించారు. సోమవారం అల్లూరి సీతారామరాజు, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. మిగతా జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఆదివారం సాయంత్రం 5 గంటల నాటికి గుంటూరులో 81 మి.మీ, పల్నాడు జిల్లా తుర్లపాడులో 54.5 మి.మీ, పెద్దకూరపాడులో 40.2 మి.మీ, గుంటూరు జిల్లా వంగిపురంలో 39.5 మి.మీ, కోనసీమ జిల్లా ముక్కములలో 39 మి.మీ చొప్పున వర్షపాతం నమోదైందన్నారు.

# రాష్ట్రంలో శరవేగంగా పర్యాటకాభివృద్ధి

- 2047 నాటికి ప్రపంచ పర్యాటక కేంద్రం
- అక్కసుతోనే వైసీపీ నాయకుల దుష్ప్రచారం
- జగన్ కట్టిన మెడికల్ కాలేజీలు ఎక్కడ?
- పీపీపీ అర్థం తెలుసుకుని మాట్లాడాలి
- రోజాకు పవన్‌ను విమర్శించే అర్హత లేదు
- పర్యాటక మంత్రి కందుల దుర్గేష్

రాజమండ్రి(చైతన్యరథం): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకా రంతో రాష్ట్రంలో పర్యాటకాభివృద్ధి శరవేగంగా జరుగుతోందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. ఆదివారం రాజమండ్రి క్యాంపు కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో 15 నెలల కాలంలో కూటమి ప్రభుత్వం రాష్ట్ర పర్యాటకాభివృద్ధికి తీసుకున్న చర్యలు, పనుల పురోగతిని వివరించారు. అదేవిధంగా తాజా రాజకీయ పరిణా మాలు, వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, మెడికల్ కాలేజీల అంశం, నిడదవోలు నియోజకవర్గ అభివృద్ధి కోసం చేస్తున్న కృషి, జనసేన పార్టీ సంస్థాగత నిర్మాణం తదితర విష యాలను మీడియాతో పంచుకున్నారు.

**రూ.10,644 కోట్ల పర్యాటక పెట్టుబడులు**

కూటమి ప్రభుత్వ 15నెలల కాలంలో రూ.10,644 కోట్ల పెట్టుబడులకు ఎంవోయూలు కుదుర్చుకున్నామని తెలిపారు. ఇప్పటికే రూ.698 కోట్లతో 88 ప్రాజెక్టులు ప్రారంభించినట్లు వెల్లడించారు. పర్యాటక, అతిథ్య రంగంలో 3554 మందికి ఉపాధి కలగనుందన్నారు. ఐదేళ్లలో రూ.25,000 కోట్ల పర్యాటక పెట్టుబడులు ఆకర్షించాలని ధ్యేయంగా పెట్టుకున్నామ న్నారు. రాష్ట్రంలోని హోటళ్లలో గదుల సంఖ్యను 50 వేలకు పెంచేలా నిర్ణయించాం. ఇప్పటికే ఆ దిశగా అడుగులు పడ్డాయి. 4.6 శాతం ఉన్న జీవీఏను 8 శాతానికి పెంచడం, 28 శాతానికి పైబడి జీవీఏను కాంట్రిబ్యూట్ చేయడం, పర్యాటక రంగంలో 12శాతం ఉపాధిని 15 శాతానికి పెంచాలన్న ధ్యేయంతో పర్యాటక శాఖ పనిచేస్తుంది. 2047 నాటికి ప్రపంచంలో ఏపీని ప్రధాన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలన్నదే కూటమి ప్రభుత్వ సంకల్పం. దేశానికి విదేశీ పర్యాటకులు అత్యధికంగా వచ్చే టాప్ 10రాష్ట్రాల్లో ఏపీను ఒకటిగా తయారుచేయాలన్న తమ ఆలోచన. క్యారవాన్ టూరిజం అనే అంశం నూతన పాలసీలోనిది. టూరిజం సర్క్యూట్‌లలో ఈ క్యారవాన్ వెహికిల్స్ ఉపకరిస్తాయి. ఇటీవలే విశాఖలో సైట్ సీయింగ్ కోసం డబుల్ డెక్కర్ బస్సులను ప్రారంభించాం. రూ.250 టికెట్ కొంటే 24 గంటలు తిరిగేలా 11 సందర్శనీయ ప్రాంతాలను చూసేందుకు వీలు కల్పించాం. రాష్ట్ర పర్యాటక రంగానికి కేంద్ర సహకారం మెండుగా ఉందని పేర్కొన్నారు.

***సరికొత్త పర్యాటక శోభ***

శాస్కి స్కీమ్ ద్వారా అఖండ గోదావరి ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం రూ.94.44 కోట్లు మంజూరు చేసిందని వెల్లడించారు. రాజమండ్రిలో 127 ఏళ్ల చరిత్ర కలిగిన హేవలాక్ వంతెన పున ర్నిర్మాణం, పుష్కర ఘాట్‌ను అధ్యాత్మిక గమ్యస్థానంగా అభివృద్ధి చేసి డైనమిక్ టూరిస్ట్ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దనున్నాం. బ్రిడ్జి లంకలో వసతి సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే శంకుస్థాపన కార్యక్రమం చేశాం.. కొన్నింటికి టెండర్లు పూర్తయ్యాయి. మరి కొన్ని తుది దశలో ఉన్నాయని తెలిపారు. 15, 16 తేదీల్లో అమరా వతిలో కలెక్టర్ల కాన్ఫరెన్స్ ఉంది. ఇప్పటి వరకు జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన పి.ప్రశాంతి పనితీరు అద్భుతం. నూతన కలెక్టర్ కీర్తి చేకూరి జిల్లా అభివృద్ధికి మంచి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. పుణ్య క్షేత్రాల్లో రద్దీ నియంత్రణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**వైసీపీ నేతలకు పీపీపీ అంటే అర్థం తెలియదు**

పీపీపీ అంటే అర్థం తెలియని వైసీపీ రాష్ట్రంలో ఉండటం దరిద్రమని విమర్శించారు. పీపీపీ అంటే కేవలం ప్రైవేటీకరణ అని ప్రజలను తప్పుదోవపట్టిస్తు న్నారు. పీపీపీ అర్థం తెలుసుకుని మాట్లాడితే బాగుం టుందని వైసీపీ నాయకులకు హితవు పలికారు. నిజంగా గత ప్రభుత్వ హయాంలో మెడికల్ కాలేజీల నిర్మాణం పూర్తయితే రాజమండ్రి కాలేజీ పరిస్థితి ఏంటో మీడియా ప్రతినిధులే చెప్పాలి. రాజమండ్రి మెడికల్ కాలేజీ నేటికీ పూర్తి కాలేదు. ఐదేళ్లలో దశల వారీగా ఎన్ని మెడికల్ కాలేజీలు కట్టారో లెక్క చెప్పాలని ప్రశ్నించారు. సకాలంలో నిర్మాణాలు పూర్తిచేసి అత్యాధునిక సౌకర్యాలు కల్పించడం కోసమే పీపీపీ అని తెలిపారు.



***పవన్‌పై రోజాకు మాట్లాడే అర్హత ఉందా?***

నాడు ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్న రోజా జబర్దస్త్ ప్రోగ్రాంలో నిర్దేతగా వ్యవహరించలేదా అని మంత్రి నిలదీశారు. పవన్‌క క్యాష్‌పై మాట్లాడే అర్హత ఎక్కడుంది అని మండిపడ్డారు. పర్యాటక మంత్రిగా రోజా రాష్ట్రంలో ఏ ఒక్క ప్రాజెక్టు అయినా తీసుకొచ్చారా అని ప్రశ్నించారు. నాటి రాష్ట్ర ప్రభుత్వం పర్యాట కాభివృద్ధి కి తీసుకున్న చర్యలేంటి? కేంద్రంతో మాట్లాడి ఏ రోజైనా నిధులు తీసుకొచ్చారా అని ప్రశ్నించారు. డిప్యూటీ సీఎం పవన్ ఒక్క రోజులోనే రికార్డు స్థాయిలో రాష్ట్రంలో గ్రామసభలు నిర్వహించార న్నారు. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా వేలాది కోట్ల నిధులు తెచ్చారు. డిప్యూటీ సీఎం ఆధ్వర్యంలోని ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా రూ.20 కోట్ల నిధులు మంజూరు చేయించుకున్న తొలి ఎమ్మెల్యే, మంత్రిని తానేనని స్పష్టం చేశారు. సంబంధిత శాఖ ద్వారా లింక్ రోడ్లు, గ్రామీణ రోడ్లు వేయించాం. పవన్ పంచాయతీలకు ఆదాయాన్ని పెంపొందించే కార్యక్రమాలు చేపడుతున్నా రు. ఏనాడు కూడా ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించలేదు.. ఖాళీ సమయాన్ని మాత్రమే సినిమాల కోసం వెచ్చిస్తున్నారు. కానీ రోజాకు దొంగ వ్యాపారాలు ఉన్నాయి..కబ్జాలు చేస్తున్నారు.. పవన్‌కు ఏ రకమైన వ్యాపారాలు లేవు.. సినిమాల ద్వారా వచ్చిన ఆదాయాన్ని సైతం ప్రజల కోసమే ఖర్చు చేస్తున్నారని స్పష్టం చేశారు. ఆయన విమాన ప్రయాణాలపై ఆక్షేపించడానికి ఏ మాత్రం అభివృద్ధి చేయని రోజాకు ఏ అర్హత లేదన్నారు. గత ఐదేళ్లలో గ్రామసభలను పట్టించుకోని గత ప్రభుత్వాన్ని ఎందుకు ప్రశ్నించలేదని మీడియా ప్రతినిధులను ప్రశ్నించారు. గ్రామ సభలను ప్రారంభించిన ఘనత కూటమి ప్రభుత్వానిదే అన్నారు. గత ఐదేళ్లలో వైసీపీ గ్రామాలను పట్టించుకోలేదన్నారు.

***యునెస్కో గుర్తింపు అభినందనీయం***

ఎర్రమట్టి దిబ్బలు, తిరుమల కొండలకు యునెస్కో జాబితాలో చోటు దక్కించుకోవడం అభినందనీయం. అహోబిలానికి ఈ గుర్తింపు దక్కేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అక్టోబర్ నుండి జనసేన సంస్థాగత నిర్మాణం కోసం చర్యలు చేపడ తాం. కమిటీల నియామకాలు చేపడతాం. జనసేనాని పవన్ కళ్యాణ్ ఆశీస్సులతో మంత్రిగా అవకాశం లభించింది.. పరిపాలనాదక్షుడైన విజనరీ లీడర్ సీఎం చంద్రబాబు మార్గదర్శకత్వంలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు.

# అమరావతిపై.. అసురులకు అంత ప్రేమా?

మూడు రాజధానులంటూ రాష్ట్రాన్ని నిలువునా ముంచిన త్రిపురాసురుడిని బ్యాలెట్ పోరులో వధించింది ఏపీ ప్రజానీకం. దాంతో ఏడాదిన్నర తర్వాత అమరావతిపై కొత్త పాట వినిపించడం మొదలుపెట్టారు జగన్‌రెడ్డి పెద్ద గుమాస్తా సజ్జల. ఒక ప్రయివేట్ సంస్థ నిర్వహించిన చర్చా గోష్టిలో 'రాజధాని నిర్మాణం మూడేళ్లలో పూర్తి చేస్తామని కూటమి ప్రభుత్వం చెబుతోంది కదా.. ఒకవేళ మళ్లీ మీరొస్తే అమరావతిని మార్చరుగా' అన్న ప్రశ్నకు 'ఇప్పటికే రాజధాని ఉంది కదా. సచివాలయం ఉంది. అయినా చంద్రబాబు కొత్తవి కట్టకపోయినా ఫర్వాలేదు. ఉన్న బిల్డింగ్‌లతో నడుపుకోవచ్చు' అని సజ్జల సుద్దులు చెప్పారు. ఇన్నాళ్లూ అమరావతిలో ఒక్క ఇటుక కూడా పెట్టలేదు. అమరావతిలో ఏముంది? ఆ బిల్డింగులన్నీ గ్రాఫిక్సే.. అది ఒక ఎడారి.. శ్మశానం.. ముంపు ప్రాంతం.. ఇన్ సైడ్ ట్రేడింగ్.. అంటూ అక్కసు వెళ్లగక్కి.. నానావిధాలా తూలనాడి అమరావతి రెక్కలు విరిచారు. అమరావతిని వేశ్యల రాజధానిగా వర్ణించినా జగన్ ముఠా ఖండించలేదు. అమరావతి నిర్మాణానికి రుణమిచ్చేందుకు ముందుకొచ్చిన సంస్థలకు అడ్డుపడ్డారు. రాజధాని నిర్మాణంలో పాలుపంచుకోవద్దంటూ సింగపూర్ ప్రతినిధులకు లేఖలు పంపారు. సింగపూర్ ప్రభుత్వాన్నే బెదిరించి అమరావతి ప్రాజెక్టునుంచి తరిమేసి రివర్స్ టెండరింగ్ పేరిట అంతర్జాతీయస్థాయిలో రాష్ట్రం పరువు తీసిన అసురుల ముఠా.. నేడు మేము అధికారంలో ఉండగా ఒక్క పారిశ్రామికవేత్తనూ వెళ్లగొట్టలేదంటూ సుద్దులు చెప్పడం.. అమరావతిలో రాజధాని ఉంది, సచివాలయం కూడా అని మాట్లాడటం చూసి గురివిందలు సిగ్గుపడుతున్నాయి. రాజధాని రైతులను పగవాళ్లుగా భావించి, వారిని నానావిధాలా హింసించిన సజ్జల.. ఇప్పుడు అదే అమరావతి రైతులపై కపట ప్రేమ ప్రదర్శిస్తున్నారు. 'మేం రైతుల రిటర్నబుల్ ప్లాట్లు అభివృద్ధి పూర్తిచేసే వాళ్లం. ఈసారి రైతుల ప్లాట్లను అభివృద్ధి చేసి, వాటి సేలబులిటీ పెంచుతా'మంటూ శ్రీరంగనీతులు చెబుతున్నారు. అమరావతిలో రోడ్లను సైతం తవ్వించినవారు.. అమరావతిలో రోడ్లు వేశామని, విజయవాడను తామే అభివృద్ధి చేశామని సజ్జల రామకృష్ణారెడ్డి నగ్నంగా బరితెగించి అబద్ధాలకు తెగబడ్డారు. విజయవాడలో కొత్త ఫ్లైఓవర్లు పూర్తి చేశాం. అమరావతిని అనుసంధానించే పశ్చిమ బైపాస్ రోడ్డును మేమే వేశాం. చివరికి చంద్రబాబు ఇంటిముందు కరకట్ట రోడ్డు కూడా మేమే వేశామని.. చెప్పుకోవడం సిగ్గుచేటు. అయినా ఎవరికో పుట్టినబిడ్డను తమకు పుట్టినట్టుగా చెప్పుకోవడం జగన్ ముఠాకి అలవాటే!

అమరావతిపై అసురులు కపటనాటకం మొదలెట్టారు. ఏదోకవిధంగా ప్రజలను నమ్మించి వారి కళ్లకు గంతలుకట్టే రాజకీయంలో రాటు తేలిపోయింది జగన్ ముఠా. రాష్ట్ర ప్రజలను ఎన్నిసార్లయినా మోసగించవచ్చన్నది జగన్ ముఠా ధీమా. తామేది చెబితే ప్రజలు అదే నమ్ముతారని అసురులలకు అపార నమ్మకం. అమరావతి అన్న పేరు పలకడానికి కూడా ఇష్టపడని అసురులకు.. అమరావతిపై ప్రేమ పుట్టుకురావడం వింతల్లో వింత! అది అమరావతిపై ప్రేమనుకొంటే భ్రమే అవుతుంది. జగన్ ముఖ్యమంత్రి అయిన దగ్గరనుంచి అమరావతిని చంపేయడానికి చెయ్యని ప్రయత్నం లేదు. నేడు ఒక్కసారిగా అమరావతిపై ప్రేమ పుట్టుకొచ్చి సుద్దులు చెబుతున్నారు సజ్జల. రాజధానిగా అమరావతినే కొనసాగించాలని రైతులు, మహిళలు 1600 రోజులపాటు ఆందోళన చేపట్టినా, రాజధానికి భూములిచ్చిన రైతులు గుండెలాగినా.. ఆత్మహత్యలకు పాల్పడినా.. పట్టించుకోని ఘట్టాలు రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ మరువరు. ఎవరు అడ్డువస్తారో చూస్తాం.. ఎట్టి పరిస్థితుల్లోనూ రాజధానిని విశాఖకు తరలించి తీరతామని మంత్రులు, వైసీపీ నేతలు సవాళ్లు చేశారు. మూడు రాజధానులంటూ సీఆర్‌డీఏ రద్దు చేసి నిరంకుశంగా మందబలంతో వికేంద్రీకరణ బిల్లును అసెంబ్లీలో ఆమోదించుకొన్నారు. రాజకీయ అవసరాల కోసం జనవంచనలో జగన్ ఘనుడని ఇప్పటికే అనేకసార్లు రుజువైంది. ఇప్పుడు కూడా అమరావతిపై మరొక పన్నాగంతో ముందుకొస్తున్నారు. అమరావతిపై జగన్‌కి, ఆయన ముఠాకి చిత్తశుద్ధి తప్ప, చిత్తశుద్ధిలేదని ప్రజలు గ్రహించాలి. ఉద్యమకారులపై వైసీపీ ప్రభుత్వం సాగించిన దమనకాండను ప్రజలు ఎప్పటికీ మరువరు. రాజధానికి భూములిచ్చిన రైతులను పెయిడ్ ఆర్టిస్టులుగా, పెయిడ్ ఉద్యమంగా చిత్రీకరించిన ఘట్టాలు విస్మరించేవి కావు. 2019 ఎన్నికలకు ముందు గుంటూరులో పార్టీ ప్లీనరీ నిర్వహించింది వైసీపీ. రాజధానిగా అమరావతే ఉంటుందని నమ్మబలికింది. అందుకే తాడేపల్లిలో సొంత నివాసం ఏర్పాటు చేసుకున్నానని జగన్ బుకాయించారు. అధికారంలోకి వచ్చాక నిజ స్వరూపాన్ని బయటపెట్టారు. అమరావతి అంటే మొదటినుంచీ జగన్‌కి, ఆయన ముఠాకి అసూయ, కడుపుమంటే! అమరావతిపై వివిధ రూపాల్లో నిరంతరం విషంగక్కుతూనే ఉన్నారు.

గొర్రెతోలు కప్పుకున్న తోడేలువంటి మాటలకు అతికినట్టు సరిపోయే నయవంచక వ్యక్తిత్వం జగన్మోహన్‌రెడ్డిది, ఆయన ముఠాది. 'రాజధాని కచ్చితంగా రాష్ట్రం నడిబొడ్డునుండేలా చూడండి. అందుకు కనీసం 30వేల ఎకరాలుండేచోట రాజధానిని నిర్మించాలంటూ' ఆనాడు అసెంబ్లీలో ప్రతిపక్షనేతగా జగన్ బల్లగుద్ది మరీ చెప్పారు. అమరావతి ఎక్కడపెట్టినా అభ్యంతరం చెప్పను కానీ, రాష్ట్రానికి మధ్యలో ఉండేలా చూడండి. విజయవాడ–గుంటూరు పరిసర ప్రాంతాల్లో రాజధాని నిర్మాణాన్ని తానెప్పుడూ వ్యతిరేకించలేదని నమ్మబలికారు. అటువంటి పెద్దమనిషి పదవిలోకి రాగానే ఏం చేశారు? అవన్నీ తూచ్ అంటూ.. మూడు రాజధానుల కొత్త పల్లవిని అందుకున్నారు. అనాగరిక విద్వేష రాజకీయాలతో ప్రాంతాలమధ్య వైషమ్యాలను ఎగదోశారు. ఆయన చెప్పినట్టే రాష్ట్రం మధ్యలోని అమరావతి రాజధానిగా ఎంపికైంది. నవనగర నిర్మాణం కోసం 29వేలమందికిపైగా రైతులను ఒప్పించి 34వేల ఎకరాల భూములను తెదేపా ప్రభుత్వం సమీకరించింది. కోటి చదరపు అడుగులకు పైగా విస్తీర్ణంలో పలు నిర్మాణాలు ఆరంభించి– వాటిలో యాభై శాతానికి పైగా పూర్తి చేసింది. అమరావతికి వ్యతిరేకినికానని నమ్మబలికి.. అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి.. మూడు నెలలకే రాజధానిపై టన్నులకొద్దీ విషాన్ని విరజిమ్మారు. వేల కోట్ల రూపాయల ప్రజాధనంతో అప్పటి ప్రభుత్వం చేసిన పనులన్నింటినీ పాడుపెట్టి అమరావతి ఆయువు తీశారు. అమరావతి నిర్మాణానికి డబ్బులేవని దొంగ ఏడుపులు ఏడ్చారు. ఐదు కోట్ల ఆంధ్రుల భవితకు ఆలంబన కావాల్సిన అమరావతిని ఆదిలోనే దుంపనాశనం చేసి, స్వర్ణాంధ్రకు సమాధి కట్టిన పైశాచికత్వం జగన్ రెడ్డిది. చంద్రబాబుపై అక్కసుతో అమరావతికి కాలయముడయ్యారు. అమరావతి రైతులను అమానుషంగా వేధించిన క్రూరుడు జగన్. రైతులతో కుదుర్చుకున్న చట్టబద్ధమైన ఒప్పందం మేరకు అమరావతి నిర్మాణాన్ని పూర్తి చేయాలన్న హైకోర్టు తీర్పును కాలదన్నిన దురహంకారి జగన్. సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టులను వేర్వేరుచోట్ల పెడతామంటూ మూడు రాజధానుల పేరుతో ప్రాంతీయ విద్వేష జ్వాలలను రగిల్చి ఓట్ల చలి కాచుకోవాలనుకున్న పరమ దుర్మార్గుడు జగన్‌రెడ్డి.

వచ్చే ఎన్నికల్లో వైసీపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజధాని అమరావతినుంచే పాలన చేస్తారంటూ సజ్జల రామకృష్ణారెడ్డి వ్యాఖ్యలపై రాజధానికి భూములిచ్చిన రైతులు మరోసారి జగన్ ముఠా మాటలు నమ్మి మోసపోవడానికి సిద్ధంగా లేమంటున్నారు. పరిపాలనకు ప్రస్తుతమున్న సచివాలయం సరిపోతుందని, కొత్త భవనాలు అవసరం లేదంటూ సజ్జల చేసిన వ్యాఖ్యలు చూస్తే అమరావతిపై జగన్ ముఠాకి ద్వేషం తగ్గలేదని రుజువవుతుంది. ప్రస్తుతమున్న సచివాలయం, హైకోర్టు భవనాలనే నిన్నటి వరకు గ్రాఫిక్స్ అంటూ వైసీపీ నేతలు ఎద్దేవా చేశారని, ఆయా భవనాలు సరిపోతాయనడం ఎంతవరకు సబబని అమరావతి రైతులు ప్రశ్నిస్తున్నారు. సీఆర్డీఏ చట్టం ప్రకారం అమరావతిని అభివృద్ధి చేస్తూ, రైతులకు న్యాయం చేస్తానన్న మాటకు కట్టుబడి సీఎం చంద్రబాబు నాయుడు ముందుకెళు తున్నారు. జగన్‌రెడ్డి చేతిలో శిథిలమైన రాజధాని నగర నిర్మాణానికి మళ్లీ జీవం పోసే బృహత్తర కర్తవ్యంతో కూటమి ప్రభుత్వం రాజధాని నిర్మాణ పనులు పరుగులు పెట్టిస్తోంది. అడుగడుగునా ఆరోపణలు, అవరోధాల నడుమ ప్రజా రాజధాని రూపుదిద్దుకొంటుంది. ఏదేమైనా.. ఐదు కోట్ల ఆంధ్రుల భవిత కోసం అమరావతి రూపంలో ఒక మహానగరాన్ని నిర్మించుకునే అవకాశం ఆంధ్రకు దక్కింది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత దేశంలో కొత్తగా నిర్మించాలని తలపెట్టిన అతి పెద్ద నగరం అమరావతి. ఆ చారిత్రిక స్పృహ, ఆ దార్శనికతవున్న నాయకుడు నేడు ఏపీ ముఖ్యమంత్రిగా ఉన్నారు కాబట్టే.. నేడు అమరావతి అంతర్జాతీయ అత్యాధునిక ప్రజారాజధానిగా రూపుదిద్దుకుంటోంది.

- నీరుకొండ ప్రసాద్



తిరుపతిలో నిర్వహిస్తున్న తొలి జాతీయ మహిళా సాధికారత సదస్సులో పాల్గొన్న ఉత్తరాంధ్ర మహిళా ప్రజాప్రతినిధులు.

# వికసిత్ భారత్ సదస్సులో కడప ఎమ్మెల్యే రెడెప్పగారి మాధవి




తిరుపతి, (చైతన్యరథం): తిరుపతిలో తొలిసారిగా రెండు రోజుల పాటు జరుగుతున్న జాతీయ మహిళా సాధికారతపై పార్లమెంటు, శాసనసభ కమిటీల సమావేశంలో ప్రభుత్వ విప్ కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవి పాల్గొన్నారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఆధ్వర్యంలో "వికసిత్ భారత్‌కు మహిళల నాయకత్వం" అనే అంశంపై ఈ సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ పాల్గొన్నారు. మహిళా ప్రజాప్రతినిధుల ఎదుగుదల సవాళ్లను అధిగమించడంలో మహిళా సాధికారత ప్రాధాన్యతపై చర్చలు జరిగాయి. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, పార్లమెంట్ కమిటీ (మహిళా సాధికారత) చైర్‌పర్సన్ దగ్గుపాటి పురందేశ్వరి, అలాగే వివిధ రాష్ట్రాల మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రతినిధులు హాజరయ్యారు.



తిరుపతిలో నిర్వహిస్తున్న తొలి జాతీయ మహిళా సాధికారత సదస్సులో పాల్గొన్న రాయలసీమఇ మహిళా ప్రజాప్రతినిధులు.

# నీటి మడుగులో గుంటూరు నగరం



## స్తంభించిన జనజీవనం

గుంటూరు, (చైతన్యరథం): గుంటూరు నగరంలో రెండు గంటల పాటు కుంభవృష్టి వర్షం కురిసింది. భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధాన రహదారులన్నీ చెరువులను తలపించాయి. డ్రైనేజీ కాలువలు పొంగి రహదారులపైకి నీరు చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వంతెనల కిందకు వరద నీరు చేరడంతో ఆ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. కంకరగుంట ఆర్ యూబీ కింద కూడా వాన నీరు చేరింది. శ్రీనగర్, బొంగరలాబీడు, బ్రాడీపేట్, అరండల్ పేట్ సహా

# శ్రీవారి బ్రహ్మోత్సవాలకు భారీ ఏర్పాట్లు

## పరిశీలించిన తితిదే చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్ కుమార్

తిరుమల, (చైతన్యరథం): శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని తితిదే చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. ఈవో అనిల్ కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, ఇతర అధికారులతో కలిసి బీఆర్ నాయుడు ఆలయ మాడ వీధులను పరిశీలించారు. ఈనెల 24 నుంచి ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు బ్రహ్మాండంగా సాగుతున్నాయని తెలిపారు. 10 రోజుల్లో మిగిలిన పనులు పూర్తి చేస్తామన్నారు. తిరుమలంతా 35 ఎస్‌ఈడీ స్క్రీన్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రత్యేకమైన విద్యుత్తు, పుష్ప అలంకరణలు చేస్తున్నామన్నారు.



# ఆంధ్ర శబరిమలకు మార్గం సుగమం



ప్రత్తిపాడు, (చైతన్యరథం) ఎత్తైన కొండల నడుమ జాలువారే జలపాతం.. ప్రకృతి రమణీయంగా కనిపించే ధారక్షేత్రం వీటన్నింటికి తోడు 18 కొండల నడుమ ఆంధ్రా శబరిమల అయ్యప్పస్వామి ఆలయం.. ఇవన్నీ దర్శించే భాగ్యం చాలా కాలానికి సులువైంది. కాకినాడ జిల్లా శంఖవరం మండల పరిధిలోని ఈ ప్రాంతాలకు రహదారులు దుర్భరంగా ఉండడంతో 13 ఏళ్ల కిందట బస్సు సేవలు నిలిపివేశారు. ఇబ్బందులు మొదలయ్యాయి. శంఖవరం-వేళంగి రహదారిపై భారీ గుంతలు ఏర్పడడంతో రాకపోకలకు సాహసమే చేయాల్సి వచ్చేది. కూటమి ప్రభుత్వం రహదారి నిర్మాణం, బస్సు సౌకర్యం ఏర్పాటు చేయడంతో స్థానికులతోపాటు పర్యాటకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి ధార మల్లికార్జునుడి క్షేత్రం, సిద్ధివారిపాలెంలో కొలువైన ఆంధ్రా శబరిమల ఆలయంలోని అయ్యప్ప దర్శనాలతోపాటు పర్యాటకుల సందడికి దారులు తెరుచుకున్నాయి. వచ్చే కార్తికమాసంలో ఇక్కడికి వచ్చే వేలాది మాలధారులకు సౌకర్యం సమకూరింది. వారందరికోసం దుకాణాలు ఏర్పాటుచేసే చిరు వ్యాపారులకూ జీవనోపాధి కలగనుంది.



విజయవాడ, పోరంకి లోని మురళి రిసార్ట్స్‌లో విశ్వభారతి విద్యాసంస్థల చైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ 85వ జన్మదిన వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేసిన రాష్ట్ర మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య





# ఉపాధ్యాయ ఉద్యోగ సాధకులకు సన్మానం

జగ్గంపేట, (చైతన్యరథం): స్థానిక రావులమ్మ నగర్ లోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా నిర్వహించిన ఉచిత టెట్ డీఎస్సీ కోచింగ్ లో 23 మంది ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించడంతో వారికి జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అభినందన సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ, నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్, జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్, జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ చైర్మన్ జ్యోతుల మణి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన 23 మంది మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎక్కువమంది ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించాలని ఉద్దేశంతో జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా సకల వసతులు కల్పించి బెస్ట్ పేకాలిటితో బెస్ట్ మెటీరియల్ తో చక్కని వసతి, భోజన వసతి తో పాటు మా స్వస్థలాలకు వెళ్లేందుకు బస్సులు ఏర్పాటు చేసి మమ్మల్ని ఈ రోజు టీచర్లుగా ఉద్యోగాలు సాధించడానికి అన్ని రకాలుగా సహాయ

**ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయిన జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ, జిల్లా టిడిపి అధ్యక్షుడు జ్యోతుల నవీన్, జ్యోతుల ఫౌండేషన్ చైర్మన్ జ్యోతుల మణి**

సహకారాలు అందించిన జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ చైర్మన్ జ్యోతుల మణి, జ్యోతుల నవీన్, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కు జీవిత కాలం రుణపడి ఉంటామని మా కన్న తల్లిదండ్రులు జన్మనిస్తే మీరు మాకు పునర్జన్మని ఇచ్చి ఈరోజు టీచర్లుగా భావితరాలకు విద్యను అందించే అవకాశాన్ని కల్పించడం మా అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. ఫౌండేషన్ డిఎస్సీ కమిటీ సభ్యులు మాట్లాడుతూ తొలి ప్రయత్నం లోనే కార్పొరేట్ కోచింగ్ సెంటర్లకు దీటుగా మంచి రిజల్ట్స్ సాధించామని దీనికి ముఖ్య కారణం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ డెడికేషనని జ్యోతుల నవీన్ అంకిత భావం, జ్యోతుల మణి అన్నపూర్ణల ఆదరించి అన్నం పెట్టడం వలనే సాధించామని అన్నారు. జ్యోతుల మణి, నవీన్, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా మీ అందరికీ ఉపాధ్యాయ ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యంతో ఏర్పాటైన ఉచిత డీఎస్సీ కోచింగ్ సెంటర్ కు 400 మంది పైబడి కోచింగ్ తీసుకుంటే ఈరోజు 23 మంది ఉపాధ్యాయులుగా ఉద్యోగం సాధించడం చాలా ఆనందంగా ఉందని చాలామంది అర మార్కు, ఒక మార్కు తేడాతో క్వాలిఫై అవ్వకపోవడం చాలా దురదృష్టకరమని అయినా వారికి కూడా మీలాగే ఒక మీటింగ్ ఏర్పాటు చేసి ప్రైవేట్ విద్యాసంస్థల్లోనూ, ప్రైవేటు సంస్థల్లోనూ ఉద్యోగాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ విద్యార్థులకు విద్యావ్యవస్థ ద్వారా అన్ని మౌలిక వసతులు కల్పించాలని లక్ష్యంతో ఏర్పడిందని అందులో భాగంగా స్కూల్స్ కి బెంచీలు కుర్చీలు, ఫ్యాన్స్ ఏర్పాటు చేయడమే కాకుండా వృద్ధాశ్రమం కూడా ఏర్పాటు చేయాలని లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా ఆడబిడ్డకు పెళ్ళికానుక, ఆటో కార్మికులకు ఉచిత బియ్యం పంపిణీ కార్యక్రమం ఇలా అనేక కార్యక్రమాలు చేస్తూనే గత నాలుగు సంవత్సరాలుగా ఉచిత అన్నా క్యాంటీన్ జగ్గంపేటలో ఏర్పాటు చేసి కార్యకర్తల సహకారంతో నడిపిస్తున్నామని దీనికి అన్ని విధాల సహకరిస్తున్న నాగేంద్ర చౌదరిని కూడా ఈ సందర్భంగా అభినందిస్తున్నామని అన్నారు. డీఎస్సీ కోచింగ్ కష్టపడి పని చేసిన జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ డీఎస్సీ కోచింగ్ కమిటీ 13 మంది సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, అడప భరత్, కొత్తకొండ బాబు, పోతుల మోహన్ రావు, వీరం రెడ్డి కాశి బాబు, పిల్లా చంటిబాబు,బస్వా వీరబాబు, తోట రవి, కోర్పు సాయి తేజ, గాంధీ, అడబాల భాస్కరరావు, ఉంగరాల రాము, పాలచర్ల నాగేంద్ర చౌదరి, పాఠం శెట్టి రవి, సొసైటీ ప్రెసిడెంట్లు, క్లస్టర్ ఇన్చార్జిలు, సర్పంచులు, ఎంపీటీసీలు, జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ కమిటీ సభ్యులు నీలం చక్రధర్, తోలేటి సూర్యనారాయణ, ముమ్మిడివరపు సురేష్, కంటే ఉదయభాస్కర్, గద్దే మారుతి, పడాల బాలాజీ, పుర్వేశ్వరన్న, రఘురామరాజు, అడపా తాతాజీ, సిహెచ్ జోసఫ్, బుద్ధా జి, తదితరులు పాల్గొన్నారు.



ఒంగోలులోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ప్రకాశం జిల్లా నుంచి గుంటూరు జిల్లాకు బదిలీపై వెళ్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియాను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసిన రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు, ఒంగోలు శాసనసభ్యుడు, దామచర్ల జనార్ధన్, మార్కాపురం శాసనసభ్యుడు కందుల నారాయణరెడ్డి, ఉడా చైర్మన్ షేక్ రియాజ్

## భారీ వర్షాల బాధితులకు కొవ్వూరు ఎమ్మెల్యే సాయం

చాగల్లు, (చైతన్యరథం): మండలంలోని చాగల్లు గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాల కారణంగాాఇళ్ళు కూలిపోయిన బాధితులను కలిసి వారికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని కొవ్వూరు నియోజకవర్గం శాసనసభ్యుడు ముప్పిడి వెంకటేశ్వరరావు ధైర్యం చెప్పారు. కొవ్వూరు నియోజకవర్గ శాసనసభ్యుడు ముప్పిడి వెంకటేశ్వరరావు ఈ సందర్భంగా బాధితులకు నిత్యావసర సరుకులు, రైస్ ఆర్థిక సాయం అందజేశారు. వారికి ప్రభుత్వం ద్వారా ఇల్లు మంజూరు చేసి కట్టిస్తామని తెలిపారు. పీ4లో పెట్టి మార్గదర్శుల ద్వారా వారిని ఆదుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు.



# పొంగిపొర్లుతున్న కొండవాగులు...అప్రమత్తం చేస్తున్న అధికారులు




ఏలూరు, (చైతన్యరథం): ఏలూరు జిల్లాలో కురుస్తున్న వర్షాలకు కొండవాగులు పొంగిపొర్లుతున్నాయి. రహదారులపై భారీగా వరద ప్రవహిస్తుండటంతో పలు గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. జంగారెడ్డిగూడెం మండలం పట్టినపాలెం వద్ద కాజ్వేపై జల్లేరు వాగు ప్రవహిస్తోంది. దీంతో 19 గిరిజన గ్రామాల రాకపోకలకు ఆటంకం కలుగుతోంది. బుట్టాయిగూడెం, రెడ్డిగణపవరం గ్రామాల మధ్య రహదారిపై వరద ప్రవహిస్తోంది. పోలవరం మండలంలో గుంజవరం, రేపల్లెవాడ కాలువలు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వరద ఉద్ధృతి ఎక్కువగా ఉన్న వాగులు, కాలువలు దాటవద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.



# దేశ రాజకీయాల్లో ఎన్టీఆర్ సంచలనం

## రేపు పోరంకిలో సజీవ చరిత్ర పుస్తకావిష్కరణ, పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్




పెనమలూరు, (చైతన్యరథం): పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు అండగా ఉండాలి, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి అనే ఉద్దేశ్యంతో నూతన రాజకీయ పార్టీ తెలుగుదేశం పార్టీని స్థాపించి 9నెలల కాలంలోనే అధికారాన్ని చేపట్టిన స్వర్గీయ నందమూరి తారక రామారావు చరిత్రలో ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందడం తెలుగువారికి గర్వకారణమని ఎమ్మెల్యే బ్రోడే ప్రసాద్ పేర్కొన్నారు. 1984లో ఢిల్లీ స్థాయిలో జరిగిన కుట్రను ఎదుర్కొని ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమాన్ని ఎంచుకుని ప్రభుత్వాన్ని నిలబెట్టుకున్న స్వర్గీయ ఎన్టీఆర్ రగిలించిన స్ఫూర్తి రాజకీయాలకే ఆదర్శనీయమని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ అన్నారు. అటువంటి చరిత్రను భావితారాలకు తెలిపేలా పుస్తకాన్ని దేశ రాజకీయాలను మలుపు తిప్పిన సజీవ చరిత్ర 1984 ప్రజాస్వామ్య పునరుద్ధర్ణోద్యమం రూపంలో, తీసుకువచ్చి పెనమలూరు నియోజకవర్గం, పోరంకి కేంద్రంగా నిడమానూరు రోడ్డులో మురళీరిసార్ట్స్‌లో ఆవిష్కరణ కార్యక్రమం ఏర్పాటు చేయడం సంతోషముగా ఉందన్నారు. వీఐపీ పాస్‌లు పోరంకి ఎమ్మెల్యే కార్యాలయంలో అందుబాటులో ఉంటాయని, వెల్లడించారు. ప్రజలందరూ, ఎన్టీఆర్ అభిమానులు, తెలుగుదేశం పార్టీ కుటుంబసభ్యులు తప్పక హాజరు కావాలని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ పిలుపునిచ్చారు.



## బాపట్ల కొత్త ఎస్పీగా ఉమా మహేశ్వరరావు బాధ్యతల స్వీకరణ

బాపట్ల, (చైతన్యరథం): బాపట్ల జిల్లా నూతన ఎస్పీగా ఉమామహేశ్వర్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన పరేడ్ గ్రౌండ్‌లో సిబ్బంది నుండి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలూ శాంతిభద్రతల పరిరక్షణకు తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు.



# డయేరియాపై అంతటా అప్రమత్తం

## కలెక్టర్ లక్ష్మీశ వెల్లడి



విజయవాడ, (చైతన్యరథం): డయేరియాపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పిస్తున్నామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. విజయవాడ రాజరాజేశ్వరిపేటలో ప్రతి ఇంటికీ హైజీన్ కిట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. సబ్బులు, హ్యాండ్ వాష్, పినాయిల్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందజేస్తున్నట్లు వివరించారు. డయేరియాపై ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సహాయం కోసం కంట్రోల్ రూమ్ నంబర్ 91549 70454ను ఏర్పాటు చేశామన్నారు.

# బీచ్ ఫెస్టివల్‌కు భారీ ఏర్పాట్లు

## కలెక్టర్ వినోద్‌కుమార్‌తో కలిసి పరిశీలించిన ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు




బాపట్ల, (చైతన్యరథం): ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా బాపట్ల సూర్యలంక బీచ్‌లో ఈనెల 26, 27, 28 తేదీలలో జరగనున్న బీచ్ ఫెస్టివల్ ను ఘనంగా నిర్వహించడానికి బీచ్ ఫెస్టివల్ ఏర్పాట్లను బాపట్ల జిల్లా కలెక్టర్ వి వినోద్ కుమార్‌తో కలిసి బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సముద్రతీరం ఇసుకలో రాళ్లు, ప్లాస్టిక్ వ్యర్థాలు లేకుండా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. బాపట్ల నుంచి సూర్యలంక బీచ్‌కు వచ్చే రహదారికి ఇరువైపులా ఉన్న చిల్లకంప చెట్లను తొలగించాలన్నారు. యంత్రాలతో వేగంగా జంగిల్ క్లియరెన్స్ పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ సంయుక్త కలెక్టర్ డీఆర్వో గంగాధర్ గౌడ్, ఆర్డీవో గ్లోరియా, నాగిరెడ్డి, జిల్లా పర్యాటక శాఖ అధికారి తాసిల్దార్ సలీమా, బాపట్ల మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, వివిధ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# మైసూరును మరిపించేలా విజయవాడ దసరా ఉత్సవాలు

## మీడియా సమావేశంలో ఎంపీ కేశినేని శివనాథ్, పాల్గొన్న కొనకళ్ల పట్టాభి, తదితరులు

మచిలీపట్నం, (చైతన్యరథం): గొడుగుపేటలోని భూలీల సమేత వెంకటేశ్వర స్వామిని మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ కేశినేని శివనాథ్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, సోసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ సంస్థ సభ్యులు ముత్తవరపు మురళీ దర్శించుకున్నారు. విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా ఎగ్జిబిషన్ కోసం గొడుగుపేట శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి చెందిన 40 ఎకరాల భూమిని సోసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ సంస్థ వినియోగించుకుంటోంది. 40 ఎకరాల భూమిని సుమారు 56 రోజులు వినియోగించుకుంటున్నందుకు రూ.45 లక్షలు చెక్కు ఆలయానికి అందజేశారు. వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం ఎంపీ కేశినేని శివనాథ్ చెక్కును స్వామివారి పాదాల చెంత ఉంచారు. ఎంపీ కేశినేని శివనాథ్ మీడియాతో మాట్లాడుతూ విజయవాడ సంస్కృతి, కళలకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చే లక్ష్యంతో విజయవాడ ఉత్సవ్ నిర్వహిస్తున్నామన్నారు. సాంస్కృతిక పర్యాటక కేంద్రంగా విజయవాడను అభివృద్ధి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. దసరా ఉత్సవాలు అంటే అందరికీ మైసూరు గుర్తొస్తుందన్నారు. అదే విధంగా విజయవాడను కూడా గుర్తుంచుకునేలా ఉత్సవాలు నిర్వహించాలనుకుంటున్నామని తెలిపారు. దేవాలయ స్థలం విషయంలో అపోహలు నెలకొనడం బాధాకరమన్నారు. ఆలయ కమిటీ సభ్యులందరితో చర్చించిన తర్వాతే ఆలయానికి ఆదాయం కల్పించే నిర్ణయం జరిగిందన్నారు. ఆలయ భూముల్ని వినియోగించుకుంటున్నందుకు ఆలయానికి రూ.45 లక్షలు, రైతులకు రూ.15 లక్షలు చెల్లించామన్నారు. కేవలం 56 రోజుల పాటు మాత్రమే వినియోగించుకునేలా ఆలయ కమిటీతో ఒప్పందం జరిగిందన్నారు. వెంకటేశ్వర స్వామి వారి ఆస్తుల పరిరక్షణకు చిత్తశుద్ధితో పని చేస్తామన్నారు. ఈ ఆదాయంతో గొడుగుపేట వెంకటేశ్వర స్వామి వారి ఆలయం మరింత అభివృద్ధి చెందాలన్నారు. కృష్ణా జిల్లా ప్రజలు, నాయకులు విజయవాడ ఉత్సవ్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బీచ్ ఫెస్టివల్‌ను విజయవంతం చేసినట్లుగా.. విజయవాడ ఉత్సవ్ నిర్వహిద్దామన్నారు. వేసవి సెలవుల్లో బందరులో బీచ్ ఫెస్టివల్.. దసరా సెలవుల్లో విజయవాడ ఫెస్టివల్ నిర్వహిద్దామన్నారు. దేవాలయ అభివృద్ధికి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తానని మాట ఇచ్చారు. విజయవాడ ఉత్సవ్ విజయవంతానికి ఆ దేవ దేవుడి ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నానన్నారు.



# నీటి కొరత లేని జిల్లా నెల్లూరు



## ప్రాజెక్టుల పరిరణపై నిరంతర నిఘా: మంత్రి ఆనం వెల్లడి



ఆత్మకూరు, (చైతన్యరథం): చుట్టుపక్కల ఉన్న ఐదు జిల్లాలకంటే 150 టీఎంసీల నీటిని నిలువ చేసుకున్న సామర్థ్యం నెల్లూరు జిల్లాకే ఉంది అని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వెల్లడించారు. ఆదివారం సోమశిల జలాశయం నుండి 5 6 గేట్ల ద్వారా పెన్నా నదికి నీటిని విడుదల చేసి గంగమ్మకు జల హారతిని ఇచ్చిన అనంతరం పాత్రికేయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జలాశయం సామర్థ్యాన్ని తొలిత అనుకున్న దానికన్నా 77 టీఎంసీల సామర్థ్యం వరకు పెంచినప్పటికీ కొన్ని పరిస్థితుల దృష్ట్యా 74 టీఎంసీలు వరకు నీటిని నిలువ చేస్తున్నామన్నారు. కృష్ణానది నుండి శ్రీశైలం ,నాగార్జునసాగర్, పులిచింతల, ప్రకాశం బ్యారేజీ ఏర్పాటు చేయడం వలన రాయలసీమ నెల్లూరుకి నీటి నిల్వకు అవకాశం ఏర్పడిందని అన్నారు ఏర్పడిందన్నారు. ఇరిగేషన్ శాఖ అధికారులతో ఎప్పటికప్పుడు చర్చించి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. నంద్యాల జిల్లాలో పర్యటించినప్పుడు కుందునది ప్రవాహం అధికంగా ఉన్నదని అక్కడి నుంచి నీరు పెన్నా నదికి చేరుకోవడం జరుగుతుందని గమనించడమైనదని తెలిపారు. సోమశిల జలాశయం శంకుస్థాపన నుండి ఎన్నో సందర్భాలలో నీరు నిల్వ చేయడం జరిగిందని మంత్రి పేర్కొన్నారు. నేటినుండి 20 టీఎంసీల నీటిని నిల్వ జరిగిందని అందులో కండలేరు జలాశయానికి, తెలుగు గంగ, కనుపూరు కలువాయి కాలువలకు నీటిని విడుదల చేయుటకు. తీసుకోవడం జరిగింది అన్నారు కండలేరు సామర్థ్యం 45 టీఎంసీలు ఉందని రానున్న 15 రోజులలో కండలేరు జలాశయం పూర్తిగా సామర్థ్యం మేరకు నీరు చేరుతుందని తెలిపారు. ఫ్లడ్ ఫ్లో 24000 క్యూసెక్కులు పెంచడానికి టైం పడుతుందని తెలిపారు టెంపుల్ టూరిజం పార్కుల ఏర్పాటు చేయడానికి నాలికలు ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రూపొందిస్తున్నట్లు ఆయన చెప్పారు. రెవిన్యూ అధికారులు ఆర్డబ్ల్యూఎస్ పంచాయతీరాజ్ సిబ్బంది ఎప్పటికప్పుడు అవసరమైన రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. లక్ష క్యూసెక్కులు పైన నీరు దాని ప్రభావం ఉంటుందని అన్నారు. ఆనం సంజీవరెడ్డి తెనాలి ద్వారా కరువు పీడిత ప్ర మండలాలైన మర్రిపాడు వింజమూరు దుత్తలూరుకు నీటిని అందజేసే పనులు ప్రారంభించినట్లు తెలిపారు హై పవర్ కెనాల్ ద్వారా 60 నుంచి 70 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నదని అందులో భాగంగా పెంచడం దీపం 2 కింద సంవత్సరానికి మూడు సిలిండర్లు ఇవ్వడం స్త్రీ శక్తి తల్లికి వందనం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం వంటివి ఉన్నాయన్నారు ల్యాండ్ టైటిలింగ్ రద్దుచేసి రైతులకు మంచి జరిగేలా చర్యలు తీసుకున్నామన్నారు.



# త్యాగాలకు మారుపేరు ఆర్యవైశ్యులు

## డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ

దర్శి, (చైతన్యరథం): పట్టణంలో ఆదివారం జరిగిన ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవంలో ఒంగోలు శాసనసభ్యుడు దామాచర్ల జనార్ధన్, గౌరవ రాజ్యసభ మాజీ సభ్యులు వెంకటేష్, గౌరవ మాజీ మంత్రివర్యులు ఆర్యవైశ్య ప్రముఖులు శిద్దా రాఘవరావు, చినరామ్ సత్యనారాయణ, పోనుగొండ సుబ్బారాయుడు, సోమిశెట్టి వెంకటేశ్వర్లు, దర్శి తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్, జిల్లాలోని ఆర్యవైశ్య ప్రముఖులు తదితరులు పాల్గొన్నారుఈ సందర్భంగా డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ మాట్లాడుతూ ఆర్య వైశ్యులు త్యాగాలకు స్ఫూర్తిగా నిలుస్తున్నారన్నారు. తరతరాలుగా సమాజ సేవలో ఆర్యవైశ్యుల పాత్ర కీలకం ఆనాడు అమరజీవి పొట్టి శ్రీరాములు గారు ఆంధ్ర రాష్ట్రం కోసం 58 రోజులు నిరాహార దీక్ష చేసి ప్రాణత్యాగం చేసిన మహనీయులు అదే స్ఫూర్తి ప్రతి ఆర్యవైశ్యంలో ఉందని నేను బలంగా నమ్ముతున్నాను. కష్టపడి వ్యాపారాలు చేసుకొని సంపాదించుకునే మంచి ఆర్యవైశ్యుల వర్గంలో ప్రతి కుటుంబంలోనూ కనిపిస్తుంది. వారు సంపాదించిన సొమ్ములో కొంత భాగం వారి సమాజం కోసం, వారి వర్గం కోసం పాటుపడడం వారిలో దాతృత్వానికి ప్రత్యేకగా చెప్పవచ్చు. ఆర్యవైశ్యుల సత్రాలు, దేవాలయాల నిర్మాణాలు, ఆర్యవైశ్యుల హాస్టల్ భవనాలు, నిరుపేద విద్యార్థులకు చదువులు చదివేందుకు చేయూతనివ్వడం ఇలా ఆర్యవైశ్యులకు సమాజ సేవలో తాము సంపాదించిన సంపాదనలో కొంత భాగాన్ని ఖర్చు చేయడం అన్ని వర్గాలకు స్ఫూర్తిదాయకమన్నారు. మన కూటమి ప్రభుత్వం అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాన్ని గుర్తించి రాజధాని అమరావతిలో 58 అడుగుల విగ్రహం ఏర్పాటు ఆరెకరాల స్మృతి వనాన్ని ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇలా ఆర్యవైశ్యుల అభ్యున్నతికి మన ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీ బొగ్గవరపు సుబ్బారావు గారికి, కార్యవర్గానికి డాక్టర్ లక్ష్మీ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లాలోని ఆర్యవైశ్య ప్రముఖులు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.



## తన ప్రజలను కాపాడుకోవడంలో

# మంత్రి లోకేశ్ చొరవ ప్రజాప్రతినిధులకు స్ఫూర్తిదాయకం

## నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి




నెల్లూరు, (చైతన్యరథం): తెలుగు ప్రజల ఆశా కిరణం మంత్రి లోకేష్ అని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి అన్నారు. ఆయన స్పందించిన తీరు నాయకులంతా స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. నేపాల్‌లో ఉద్రిక్తల నేపథ్యంలో అక్కడ ఉన్న తెలుగువారిని సురక్షితంగా తీసుకువచ్చారని ఆయన కొనియాడారు. ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రుల కంటే వేగంగా స్పందించి.. ప్రత్యేక చొరవ తీసుకున్నారని తెలిపారు. నెల్లూరు ఎన్టీఆర్ భవన్‌లో బాధితులతో కలిసి కోటంరెడ్డి మీడియాతో మాట్లాడారు. నెల్లూరుకి చెందిన నవీన్, నితీష్ తో పాటు ఎనిమిది మంది నేపాల్ లో ఉండే ఆలయానికి వెళ్లారు. అక్కడ ఓ హోటల్‌లో ఉండగా.. అల్లర్లు మొదలు అయ్యాయి. వాళ్ళు ఉండే హోటల్ కి నిప్పు పెట్టారు. దిక్కుతోచని స్థితిలో నవీన్ తనకి కాల్ చెయ్యగా.. పార్టీ దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు. వెంటనే లోకేష్ స్పందించారని తెలిపారు. రాష్ట్రానికి చెందిన వందల మందిని లోకేష్ ప్రత్యేక విమానాలా ద్వారా తీసుకొచ్చారని తెలిపారు. సూపర్ హిట్ సభకు కూడా వెళ్లకుండా డే అండ్ నైట్ కష్టపడి అందరిని సురక్షితంగా రాష్ట్రానికి తీసుకొచ్చారని కొనియాడారు. రాష్ట్ర ప్రజలు అందరూ లోకేష్ కి కృతజ్ఞతలు తెలుపుతున్నారని వెల్లడించారు. టీడీపీ కోసం పోరాటాలు చేసి, కేసులు పెట్టించుకుని ఇబ్బంది పడ్డ నవీన్, అతని స్నేహితులను కాపాడిన మంత్రి లోకేష్ కి రుణపడి ఉంటానని కోటంరెడ్డి అన్నారు. నవీన్ మాట్లాడుతూ, మంత్రి నారా లోకేష్, కోటంరెడ్డి లేకపోతే తాము అక్కడే ప్రాణాలు కోల్పోయే వాళ్ళమని ఆవేదన వ్యక్తం చేశారు. లోకేష్ తమ నాయకుడిగా ఉన్నందుకు గర్విస్తున్నట్లు వెల్లడించారు.


# యూనివర్సల్ హెల్త్ పాలసీతో అందరికీ వైద్యం... అందరికీ ఆరోగ్యం

## తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి చేజర్ల వేంకటేశ్వర రెడ్డి

కోవూరు, (చైతన్యరథం): ఆరోగ్యశ్రీ స్థానంలో కూటమి ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన యూనివర్సల్ హెల్త్ పాలసీ వల్ల రాష్ట్రంలోని అన్ని కుటుంబాలకు గతంలో కంటే మెరుగైన నగదు రహిత వైద్య సేవలు అందుతాయని తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి చేజర్ల వేంకటేశ్వర రెడ్డి వెల్లడించారు. ప్రస్తుతం 24 గంటలకు తరువాత చికిత్స లకు అనుమతి ఇస్తుంటే నూతన విధానంలో 6 గంటల వ్యవధిలోనే అనుమతి వస్తుందని, తద్వారా సత్వరమే వైద్యం అందుతుందని పేర్కొన్నారు. పేద, ధనిక తేడా లేకుండా రాష్ట్రంలోని 1.63 లక్షల కుటుంబాలకు ఈ పథకం వర్తిస్తుందన్నారు. 10 రాష్ట్రాలలో అమలవుతున్న వైద్య సేవలను అధ్యయనం చేసిన తరువాతనే రాష్ట్ర ప్రభుత్వం ఈహెల్త్ పాలసీ ని తీసుకొచ్చిందని వివరించారు. కోవూరులోని తన కార్యాలయం ఏర్పాటు చేసిన పత్రికా విలేఖరుల సమావేశంలో తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి చేజర్ల వేంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ అనేక మంది ప్రముఖుల సూచనలు, సలహాలు తీసుకొని ఎన్టీఆర్ వైద్య సేవ స్థానంలో యూనివర్సల్ హెల్త్ పాలసీని తీసుకొచ్చారు. ఈ పాలసీలో ఆదాయంతో సంబంధం లేకుండా, రాష్ట్రంలో ఉన్న ప్రతి వ్యక్తికి ఉచిత వైద్యం అదుతుందన్నారు. ఈ పాలసీ క్రింద రాష్ట్రంలో ఉన్న 1.63 కోట్ల కుటుంబాలకు ఉచిత వైద్యం అందుతుందన్నారు. ఉద్యోగుల ఆరోగ్య పథకంలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు, వర్కింగ్ జర్నలిస్టులు మినహా మిగిలిన ఉన్నత ఆదాయ వర్గాల వారికి ఒక ఏడాదికి రూ.2.5 లక్షల రూపాయల వరకూ నగదు రహిత వైద్య సేవలు అందుతాయన్నారు. ప్రస్తుతం ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో (ఆరోగ్య శ్రీ) ఉన్న 1.43 కోట్ల కుటుంబాలకు రూ.2.5 లక్షల వరకూ ఈ బీమా పథకం ద్వారా,రూ.2.5 లక్షలు నుండి రూ.25 లక్షల వరకూ ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా ఉచిత వైద్యం అందుతుందన్నారు. రాష్ట్రంలో 93 శాతం కుటుంబాలకు ఏడాదికి రూ 2.5 లక్షల లోపు మాత్రమే ఎన్టీఆర్ వైద్య సేవ (ఆరోగ్య శ్రీ ) క్రింద ఖర్చు అవుతుంది.అందువలన 93 శాతం మందికి బీమా పథకం క్రిందనే వైద్యం అందుతుంది. మిగిలిన వారికి రూ.2.5 లక్షల కంటే మించితే వారికి 25 లక్షల వరకూ ఎన్టీఆర్ వైద్య సేవ పథకం క్రింది వారికి వైద్యం అందుతుందన్నారు. ఇప్పటి వరకూ ఎక్కడా లేని విధంగా పేద,ధనిక తేడా లేకుండా అందరికీ నగదు రహిత వైద్య సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ఈ పథకం పై వైసీపి నాయకులు పెద్ద ఎత్తున దుష్ప్రచారం చేస్తున్నారు. ప్రజలు ఎవరూ కూడా వైసీపీ చేస్తున్న దుష్ప్రచారం నమ్మొద్దన్నారు. అన్ని రాష్ట్రాల కంటే మన రాష్ట్ర ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలనే ఆలోచనతో యూనివర్సల్ హెల్త్ పాలసీని తీసుకొచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియచేస్తున్నానన్నారు.



# నిండుకుండలా తుంగభద్ర జలాశయం



## పోటెత్తుతున్న వరద

కర్నూలు, (చైతన్యరథం): జిల్లాలో గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. వేదవతి హగరి ఉపనది నుంచి భారీగా వరద పోటెత్తడంతో తుంగభద్ర జలాశయం నిండుకుండలా మారింది. మరోవైపు తుంగభద్ర నదిలో వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. కోసిగి మండలం ఆర్డీఎస్ రాజోలి బండ డైవర్షన్ స్కీమ్ వద్ద వరద నీటి ప్రవాహం కొనసాగుతోంది. ఆంధ్ర సరిహద్దు ప్రాంతమైన కౌతాళం మండలం మేడిగనూరు రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద తుంగభద్ర నది పరవళ్లు తొక్కుతోంది.



# శ్రీవారి కళ్యాణం పోస్టర్ల ఆవిష్కరణ

విజయవాడ, (చైతన్యరథం): యూరప్‌లోని 16 ప్రాంతాల్లో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీనివాస కల్యాణ మహోత్సవాలను నిర్వహించబోతున్నారు. ఈ సందర్భంగా కార్యక్రమ పోస్టర్‌ను ఘనంగా ఆవిష్కరించారు. యూరప్‌లో నివసిస్తున్న తెలుగు ప్రజలకు ఆధ్యాత్మిక అనుభూతి కలిగించేందుకు, సంప్రదాయ సాంస్కృతిక విలువలను చేరవేయడానికి ఈ కల్యాణాలు ఎంతో దోహదం చేస్తాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తులు పాల్గొని శ్రీనివాసుడి దివ్యానుగ్రహం పొందాలని మనసారా కోరుకుంటున్నాను ఈ కార్యక్రమంలో నాతోపాటు ఏపీ ఎన్నార్టీ అధ్యక్షులు డాక్టర్ రవికుమార్ వేమూరి, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచిరాం ప్రసాద్ ఎన్‌ఆర్‌ఐలు కాట్రగడ్డ కృష్ణప్రసాద్, శ్రీకాంత్ కుడితిపూడి, సుమంత్ కొర్రపాటి, తిట్టు మద్దిపట్ల, కృష్ణ జావాజి, సూర్య వెలగ, నరేష్ కోనేరు తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాత హక్కులను హరించిన వైసీపీ

## మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ధ్వజం



నంద్యాల, (చైతన్యరథం): రైతుల హక్కులను హరించే చట్టాన్ని తీసుకొచ్చి వారిని నాశనం చేయాలని గత వైకాపా ప్రభుత్వం చూసిందని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి విమర్శించారు. అందుకే కూటమి ప్రభుత్వం రాగానే ఆ చట్టాన్ని రద్దు చేసిందని గుర్తు చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలన్నీ అమలు చేస్తున్నా.. వైకాపా నాయకులు మాత్రం అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. మంత్రి ఆనం ఆదివారం నంద్యాల జిల్లాలోని సోమశిల జలాశయం రెండు క్రస్ట్ గేట్లు ఎత్తి నీటిని పెన్నా నదిలోకి విడుదల చేశారు. అనంతరం జలహారతి ఇచ్చారు. జలాశయంలో 74 టీఎంసీల నీటి నిల్వ స్థిరంగా ఉండేలా నియంత్రిస్తామన్నారు. 20 వేల క్యూసెక్కుల వరకు నీటిని విడుదల చేస్తామని తెలిపారు. మాజీ మంత్రి మేకపాటి గౌతంరెడ్డిపై మంత్రి ఆనం ఫైర్ అయ్యారు. గడిచిన 20 ఏళ్లుగా ఉదయగిరి, మర్రిపాడు మండలాలకు గుక్కెడు నీళ్లు ఇవ్వలేని మేకపాటి కుటుంబం ఇప్పుడు ప్రశ్నించేందుకు ముందుకు వస్తోందని దుయ్యబట్టారు. సోమశిల హైలెవెల్ కెనాల్ పనుల విషయంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. "గత ఐదేళ్లలో ఆత్మకూరు నియోజకవర్గంలో కమీషన్ల కోసం ఉన్న చెరువులను చెడగొట్టి రైతులకు నీరు లేకుండా చేశారు. అప్పట్లో కృష్ణాపురం దగ్గర నవోదయ పాఠశాల కోసం భూమిని ఇచ్చి.. దానికంటే మూడింతల ప్రభుత్వ భూమి లాక్కున్నారు. మీరు ప్రజా ప్రతినిధులా? గత ప్రభుత్వంలో ఆత్మకూరు నియోజకవర్గానికి వచ్చిన కంపెనీని జగన్ బద్వేల్‌కు తరలిస్తే ఆపే దిక్కు మేకపాటి కుటుంబానికి లేదు" అని ఆనం విమర్శించారు.

# కంటి వైద్యశిబిరానికి భారీ స్పందన

## పర్యవేక్షించిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు



ఇంకొల్లు, (చైతన్యరథం): ప్రజా సంక్షేమమే లక్ష్యంగా నిరంతరం సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, ప్రజా సేవకుడిగా పేరు ప్రఖ్యాతలు సంపాదించారని మార్కెట్ కమిటీ చైర్మన్ గుంజి వెంకట్రావు, మండల పార్టీ అధ్యక్షుడు నాయుడు హనుమంతరావు పేర్కొన్నారు. ఆదివారం ఇంకొల్లు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నోవా అగ్రి గ్రూప్, ఏలూరి చారిటబుల్ ట్రస్ట్, గ్రీన్ స్పార్క్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, శంకర్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరం విశేష స్పందన పొందింది.మొత్తం 637 మంది హాజరు కాగా, 248 మందిని శస్త్రచికిత్సకు రిఫర్ చేశారు.బీపీ, షుగర్, రక్తపరీక్షలతో పాటు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు శిబిరం కొనసాగింది. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ప్రత్యేక షామియానాలు, మహిళలకు, పురుషులకు వేర్వేరు కౌంటర్లు, మంచినీటి సౌకర్యం, భోజన ఏర్పాట్లు కల్పించారు. ఉదయం 8 గంటలకే ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహానికి, ఏలూరి నాగేశ్వరరావు గారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పర్చూరు నియోజకవర్గంలో ఎవ్వరూ కంటి సమస్యలతో బాధపడకూడదనే సంకల్పంతో, ప్రతి నెల నిరంతరం ఇలాంటి శిబిరాలు నిర్వహిస్తూ, ప్రజల ఆరోగ్యం కోసం ఎమ్మెల్యే ఏలూరి చేస్తున్న సేవలు చిరస్థాయిగా నిలుస్తాయని నాయకులు పేర్కొన్నారు.



# ఒకేరోజు 1.20 కోట్ల సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

## పాల్గొన్న ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



వినుకొండ, (చైతన్యరథం): పట్టణంలోని చీఫ్ విప్ కార్యాలయంలో ఆదివారం ఒకే రోజు 1 కోటి 20 లక్షల 68 వేల 518 రూపాయల సీఎం సహాయనిది చెక్కులను ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పేద కుటుంబాలకు సీఎం సహాయనిధి ఎంతో భరోసాగా నిలుస్తుందని నియోజవర్గంలో ఇప్పటికి వేలాదిమంది పేద కుటుంబాలను సీఎం సహాయ నిధి ఆదుకుందని అన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా నియోజకవర్గంలో 204 మంది లబ్ధిదారులకు 1,20,68,518 నిధులు మంజూరై ఆదుకోవడం సంతోషకరమన్నాను. చెక్కుల పంపిణీ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జున రావు గారు, జనసేన నాయకులు నాగ శ్రీను రాయల్, నియోజకవర్గంలోని ఐదు మండలాల నాయకులు పాల్గొన్నారు.

# టీడీపీలోకి గుడిబండ వైసీపీ కుటుంబాలు

## కండువా కప్పి ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్సీ గుండుమల



మడకశిర, (చైతన్యరథం): మడకశిర పట్టణం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గుడిబండ మండలం తాళికేర పంచాయతీ బీటీ పల్లి గ్రామం వైసీపీకి చెందిన హనుమతే గౌడ, రంగస్వామి, గోవిందప్ప, ప్రసన్నకుమార్, భోజరాజు, హరీష్, ఆనందప్ప, వీరితోపాటు 40 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి వారికి పసుపు కండువా కప్పి టీడీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. మడకశిర నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో శరవేగంగా జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు చూసి ఆకర్షితులమయ్యామన్నారు. గత ఐదు సంవత్సరాలలో రైతులకు సాగునీరు అందిస్తానని చెప్పిన స్థానిక వైసీపీ మాజీఎమ్మెల్యే, చెరువులకు చుక్క నీరు కూడా ఇవ్వలేకపోయారన్నారు. జగన్ మోహన్ రెడ్డి నమ్మించి మోసం చేయడం వల్ల వైసీపీలో ఉండలేక తెలుగుదేశం పార్టీకి మద్దతుగా ఉండాలని నిర్ణయించుకొని చేరామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి కన్వీనర్లు లక్ష్మీ నరసప్ప, తిప్పేస్వామి, నాగరాజు, మాజీ మున్సిపల్ చైర్మన్ సుబ్బారాయుడు, ఈరన్న, చిత్తప్ప, కరియన్న, శివ తదితరులు పాల్గొన్నారు.

# దేశ వ్యతిరేక శక్తులను కాంగ్రెస్ రక్షిస్తోంది

◆ **ప్రధాని నరేంద్రమోదీ వ్యాఖ్యలు**

ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం అస్సాంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాని కీలక వ్యాఖ్యలు చేశారు. 1962లో జవహర్ లాల్ నెహ్రూ పాలనలో చైనా దురాక్రమణ వల్ల ఏర్పడిన గాయాలు ఇంకా మానలేదన్నారు. ఈ క్రమంలో మీరు నన్ను వ్యక్తిగతంగా ఎంత తిట్టినా నాకు పట్టింపు లేదు. కానీ దేశంలోని గొప్ప వ్యక్తులను అవమానించినప్పుడు, అది తీవ్రం గా బాధిస్తుందని మోదీ అన్నారు. నేను శివుని భక్తుడిని, అన్ని విషాలను మింగేస్తా నన్నారు. భూపెన్ హజారికాకు భారతరత్న ఇవ్వడం సరైన నిర్ణయం కాదా, దీనిపై కాంగ్రెస్ పార్టీ అవమానించడం కరెక్టేనా అంటూ ప్రజలను ప్రశ్నించారు. కానీ కాంగ్రెస్ దేశ ఆర్థిక, రాజకీయ వ్యవస్థకు వ్యతిరేకంగా నిలుస్తుందని, అయినప్పటికీ నాకు 140 కోట్ల మంది దేశ ప్రజల ఆశీస్సులు ఉన్నాయని మోదీ పేర్కొన్నారు.



**కాంగ్రెస్ పార్టీపై మోదీ**

ఈ సందర్భంగా మోదీ కాంగ్రెస్ పార్టీపై తీవ్రంగా విమర్శలు చేశారు. కాంగ్రెస్‌కు వారి ఓటు బ్యాంకు ప్రయోజనాలే ముఖ్యమని, ఎప్పుడూ దేశ ప్రయోజనాలను పట్టించుకోలేదని ఆరోపించారు. ప్రస్తుతం కూడా దేశ వ్యతిరేకులు, చొరబాటుదారుల రక్షకుడిగా కాంగ్రెస్ మారిందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు, చొరబాట్లను ప్రోత్సహించేది. నేడు కాంగ్రెస్ చొరబాటుదారులు భారతదేశంలో శాశ్వతంగా స్థిరపడాలని, దేశ భవిష్యత్తును నిర్ణయించాలని కోరుకుంటున్నారని ఎద్దేవా చేశారు.

**ప్రజలకు ప్రధాని మోదీ విజ్ఞప్తి**

మీ సమయం ఇప్పుడు మీ చేతుల్లోనే ఉంది. ఏ ప్రాంతంలోనైనా వేగవంతమైన అభివృద్ధికి కనెక్టివిటీ చాలా ముఖ్యం. 6 దశాబ్దాల స్వాతంత్ర్యంలో ఢిల్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది. అస్సాంలో దశాబ్దాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉండేది. అందులో బ్రహ్మపుత్రపై కేవలం 3 వంతెనలు మాత్రమే నిర్మించబడ్డాయి. ఇప్పుడు మీరు మా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పుడు, 6 వంతెనలు నిర్మించినట్లు గుర్తు చేశారు. ఈ క్రమంలో నేను మరిన్ని పనులు చేయాలనుకుంటు న్నానని, అసోం ప్రజలు ఆశీర్వదించాలని కోరారు.

**18 వేల కోట్ల ప్రాజెక్టులు**

ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం అస్సాంలోని దరాంగ్ పర్యటనలో ఉన్నారు. బయో-ఇథనాల్ ప్లాంట్‌ను ప్రధాని ప్రారంభించారు. దీనిని రూ.5 వేల కోట్ల వ్యయంతో నిర్మించారు. పాలీ ప్రొపైలిన్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేశారు. ఈ క్రమంలో రూ.18,530 కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రధాని అస్సాంకు బహుమతిగా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలిసారి అస్సాంకు వచ్చానని చెప్పిన మోదీ.. మా కామాఖ్య దేవి ఆశీర్వాదంతో ఆపరేషన్ సిందూర్ విజయవంతమైందని తెలిపారు.

## తేజస్వి పర్యటనలో భద్రతా లోపం

**దూసుకొచ్చిన యువకుడు**

ముజఫర్‌పూర్: బీహార్ అసెంబ్లీలో విపక్ష నేత, ఆర్జేడీ నాయకుడు తేజస్వి యాదవ్ ముజఫరాపూర్ జిల్లా పర్యటనలో భద్రతా లోపం చోటుచేసుకుంది. తేజస్వి ఒక కార్యక్రమంలో పాల్గొని తిరిగి హెలి కాప్టర్‌లో వెళ్లేందుకు సిద్ధపడుతుండగా ఒక యువకుడు సెక్యూరిటీ వలయాన్ని ఛేదించుకుని పరుగు పరుగున ఆయన దగ్గరికి వచ్చాడు. వెంటనే ఆయన పాదాలపై పడ్డాడు. దీనికి ముందు, ముజఫ రాపూర్‌లోని కాంతి స్కూలులో భారతరత్న అంబేద్కర్ విగ్రహాన్ని తేజస్వి యాదవ్ ఆవిష్కరించారు. పబ్లిక్ మీటింగ్ అనంతరం హెలికాప్టర్‌లో బయలుదేరేందుకు సిద్ధమయ్యారు. అనూహ్యంగా నల్లటి చొక్కా ధరించిన ఒక యువకుడు సెక్యూరిటీ వలయాన్ని ఛేదించుకుని తేజస్వి చెంతకువచ్చి ఆయన పాదాలపై పడ్డాడు. దీంతో ఒక్కసారిగా తేజస్వి దిగ్భ్రాంతికి గురయ్యారు. అప్రమత్తమైన భద్రతా సిబ్బంది ఆ యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. ఆ యువకుడిని షరీఫుల్ ఇస్లామ్‌గా గుర్తించారు. కాగా, ఈ ఘటనకు సంబంధించిన వీడియో ఇప్పుడు వైరల్ అవుతోంది.

## ఆర్థిక ప్రయోజనాల కోసం దిగజారను

- నా మేధస్సు విలువ నెలకు రూ.200 కోట్లు
- తనపై సోషల్ మీడియా దుష్ప్రచారం
- కేంద్ర రహదారులు, రవాణామంత్రి గడ్కరీ

నాగపూర్: పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ వాడకంపై సామాజిక మాధ్యమాల్లో చర్చ జరుగుతుండటం, ఈ చర్చ ద్వారా వ్యక్తిగత లబ్ధి పొందారంటూ తనపై వస్తున్న ఆరోపణలపై కేంద్ర రహదారులు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తన మేధస్సు విలువ నెలకు రూ.200 కోట్లు అని, ఆర్థిక ప్రయో జనాల కోసం దిగజారే ప్రసక్తే లేదని చెప్పారు. నాగపూర్‌లోని అగ్రికోస్ వెల్ఫేర్ సొసైటీ కార్యక్రమంలో గడ్కరీ ఈ



వ్యాఖ్యలు చేశారు. 'ముందుగా ఒక మాట చెప్పనీయండి. ఇదంతా సొంత సంపాదన కోసం చేయడం లేదు. నేను చెప్పకుంటే మీరు మరో రకంగా ఆలోచించవచ్చు. నాకు పుష్కలంగా ఆదాయం ఉంది. నా మెదడు విలువ.. నెలకు రూ.200 కోట్లు. నాకు డబ్బుల కొరత లేదు' అని అన్నారు. తన కుమారులకు తాను ఐడియాలు ఇస్తుంటానని, అవకతవకలకు ఎప్పుడూ పాల్పడేది లేదని స్పష్టం చేశారు. ఈ-20 పెట్రోల్ వాడకాన్ని ప్రభుత్వం ప్రోత్స హిస్తుండటంపై చర్చ జరుగుతుండగా, గడ్కరీపై కాంగ్రెస్ విమర్శలు చేసింది. ఇథనాల్‌పై ప్రభుత్వ విధానం వల్ల కేంద్ర మంత్రి కుమారులు ప్రయోజనం పొందారని, ఇందువల్లే ఇథనాల్ ప్రొడక్షన్‌పై చురుగ్గా లాబీయింగ్ చేస్తున్నారని విమర్శించింది. కాగా, ఇదంతా తనపై జరుగుతున్న 'పెయిడ్ సోషల్ మీడియా క్యాంపెయిన్'గా గడ్కరి కొట్టివేశారు. సోషల్ మీడియా ప్రచారం పెయిడ్ ప్రచారమని.. ఇథనాల్‌కు వ్యతిరేకంగా, రాజకీయంగా టార్గెట్ చేసేందుకు జరుగుతున్న ప్రచారమని తెలిపారు.

## 243 సీట్లలోనూ పోటీ చేస్తాం

**ఆర్జేడీ నేత తేజస్వియాదవ్ సంచలన ప్రకటన**


బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కొత్త కొత్త ట్విస్టులు వెలుగులోకి వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే రాష్ట్రీయ జనతాదళ్ నేత తేజస్వి యాదవ్ ఓ సంచలన ప్రకటన చేశారు. ముజఫర్‌పూర్ కాంతిలో జరిగిన బహిరంగ సభలో ఈసారి బీహార్‌లోని 243 అసెంబ్లీ స్థానాల్లోనూ తమ పార్టీ పోటీ చేస్తుందని ధీమాగా ప్రకటించారు. తేజస్వి ముఖం చూసి ఓటు వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

**ప్రభుత్వంపై విమర్శలు**

దీంతోపాటు తేజస్వి యాదవ్ ఎన్డీఏ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఈ ప్రభుత్వం కేవలం నినాదాలతోనే ప్రజలను మభ్యపెడుతోందన్నారు. బీహార్ నుంచి ఓట్లు, గుజరాత్‌లో ఫ్యాక్టరీలు.. ఇలాంటి ఎత్తుగడలు ఇక పనిచేయవని వ్యాఖ్యానించారు. ఆర్జేడీ అధికారంలోకి వస్తే ఉపాధి, అభివృద్ధి పనులపై దృష్టి సారిస్తుందని హామీ ఇచ్చారు. కాంతిలో బాబా సాహెబ్ భీమ్‌రావ్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి హాజరైన క్రమంలో పేర్కొన్నారు.

## అస్సాంలో 5.8 తీవ్రతతో భూకంపం

డిస్పూర్: అస్సాంలో ఆదివారం నాడు భూకంపం సంభవించింది. దీని తీవ్రత రిక్టర్ స్కేలుపై 5.8గా నమోదైంది. ఉదల్‌గిరి జిల్లాకు 16 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఉందని సంబంధిత అధికారులు గుర్తించారు. భూమికి 5 కిలోమీటర్ల లోతున ఇది సంభవించినట్టు అధికారులు తెలిపారు. దీని ప్రభావంతో పశ్చిమ బెంగాల్, భూటాన్‌లోనూ ప్రకంపనలు వచ్చాయి. అస్సాంలో భూకంపం సంభవించడంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారని, పలువురు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారని తెలుస్తోంది. పరిస్థితిని డిజాస్టర్ మేనేజ్మెంట్ బృందాలు చురుకుగా సమీక్షిస్తున్నాయి. కాగా, ఈ ఘటనలో ఎవరూ గాయపడినట్టు సమా



చారం లేదని, తమ టీమ్‌లు అప్రమత్తంగా ఉన్నాయని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు.

**పరిస్థితిని సమీక్షిస్తున్నాం: సీఎం**

ఉదల్ గిరిలో 5.6 తీవ్రతతో భూకంపం సంభవించిందని, అయితే ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని సమాచారం ఉందని అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తెలిపారు. పరిస్థితిని ప్రభుత్వం ఎప్పటికప్పుడు సమీక్షిస్తోందని తెలిపారు. అస్సాంలో భూకంపం సంభవించిందని, ప్రజల భద్రత కోసం ప్రార్థిస్తున్నానని కేంద్ర మంత్రి, మాజీ ముఖ్యమంత్రి సర్బానంద్ సోనోవాల్ సోమాజిక మాధ్యమం 'ఎక్స్'లో పేర్కొన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రస్తుతం అస్సాం పర్యటనలో ఉన్నారు.

## పాక్‌తో మ్యాచ్‌కు వ్యతిరేకంగా
## ఆప్ మహిళా కార్యకర్తల నిరసన

న్యూఢిల్లీ: ఇండియా-పాకిస్థాన్ 2025 ఆసియా క్రికెట్ మ్యాచ్‌కు వ్యతిరేకంగా దేశ రాజధానిలో ఆమ్ ఆద్మీ పార్టీ మహిళా విభాగం కార్యకర్తలు తీవ్ర నిరసన తెలిపారు. టెలివిజన్లు పగులగొట్టి ఈ గేమ్‌ను బహిష్కరించాలని ప్రజలను కోరారు. పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోవడంతో తల్లులు, సోదరీమణులు నుదిటి తిలకం కోల్పోయారని ఆప్ ఢిల్లీ విభాగం అధ్యక్షుడు సౌరభ్ భరద్వాజ్ మండిపడ్డారు. దాంతో ఆపరేషన్ సిందూర్ చేపట్టారని, పీఓకేను కూడా తిరిగి ఆర్మీ స్వాధీనం చేసుకుని ఉండేదని.. అయితే ఆ సమయంలో మోదీ యూటర్న్ తీసుకున్నారని సౌరభ్ భరద్వాజ్ ధ్వజమెత్తారు. ఈరోజు తల్లులు, సోదరీమణులు సిందూరంతో వచ్చారు, ఈ సిందూరం పవర్ ఏమిటో యావత్ ప్రపంచం చూస్తుందని అన్నారు.

## ఇండిగో విమానంలో సాంకేతిక లోపం

◆ **ఎగురలేక రన్‌వేపై ఆగిపోయిన విమానం** ◆ **ప్రయాణికుల్లో సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ డింపుల్ యాదవ్**

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని లక్నో విమానాశ్రయంలో ఆదివారం ఊహించని ఘటన చోటు చేసుకుంది. లక్నో నుంచి ఢిల్లీ వెళతున్న ఇండిగో విమానంలో టేకాఫ్ సమయంలో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో విమానం పైకి ఎగురలేక రన్‌వే పైనే ఆగిపోయింది. దీంతో పైలట్ చాకచక్యంగా వ్యవహరించి టేకాఫ్‌ను నిలిపివేశారు. ఆ సమయంలో సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ డింపుల్ యాదవ్ సహా 151 మంది ప్రయాణికులు విమానంలో ఉన్నట్టు అధికారులు తెలిపారు. టేకాఫ్ నిలిపివేసిన అనంతరం ప్రయాణికులను కిందకు దించి వేరే విమానంలో ఢిల్లీకి పంపారు. ఢిల్లీకి వెళ్లే 6ఈ 2111 విమానం రన్‌వేపై వేగం పుంజుకునే సమయంలో గాల్లోకి ఎగరలేకపోయింది. దీంతో పైలెట్ రన్‌వే ముగిసేలోగా విమానాన్ని ఆపేశారు. ఈ ఘటనకు సంబంధించి ఇంతవరకూ ఇండిగో ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. మరోవైపు ఈనెల 6న సైతం ఇలాంటి ఘటనే ఇండిగో విమానానికి ఎదురైంది. అబుదాబి వెళ్లాల్సిన ఇండిగో విమానం టెకాఫ్ అయిన కొద్ది సేపట్లోనే సాంకేతిక లోపం తలెత్తడంతో కొచ్చి విమానాశ్రయానికి తిరిగి వచ్చిన విషయం తెలిసిందే.



# బ్రిటన్‌లో 'వలస' నిరసనలు!

## - రాబిన్సన్ నేతృత్వంలో రోడ్లపైకి లక్షమంది..



బ్రిటన్లో భారీస్థాయిలో యాంటీ ఇమిగ్రేషన్ ర్యాలీ జరిగింది. లక్షమందికి పైగా ప్రజలు రోడ్లపైకి వచ్చి ప్రదర్శనలో పాల్గొన్నారు. అదే సమయంలో జాత్యాహంకారానికి వ్యతిరేకంగా మరో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ క్రమంలో పోలీసులపై ఆందోళనకారులు దాడులకు పాల్పడ్డారు. శనివారం సెంట్రల్ లండన్‌లో జరిగిన ఈ ర్యాలీ యూకే చరిత్రలోనే అతి పెద్దదని మెట్రోపాలిటన్ పోలీసులు పేర్కొన్నారు. వలసలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న కార్యకర్త టామీ రాబిన్సన్ ఆధ్వర్యంలో 'యునైట్ ది కింగ్డమ్' ప్రదర్శన జరిగింది. అదే సమయంలో జాత్యాహంకారానికి వ్యతిరేకంగా 'స్టాండ్ అప్ టు రేసిజమ్' అనే మరో నిరసన కూడా చేపట్టారు. దీనిలో 5వేలమంది పాల్గొన్నారు. ఈ రెండు గ్రూపుల మధ్య ఎలాంటి గొడవలు జరగకుండా ఉండేందుకు భారీగా పోలీసులు మోహరించారు. నిరసనకారులను చెదరగొట్టేందుకు వారు తీవ్రంగా ప్రయత్నించారు. ఈ క్రమంలో పోలీసుల పైకి వాటర్ బాటిళ్లు, పలు వస్తువులతో ఆందోళనకారులు దాడులు చేశారు. ఈ ఘటనలో 26మంది అధికారులు గాయపడినట్లు సమాచారం. వారిలో కొంతమంది పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది. ఈ ప్రదర్శనల్లో అమెరికా, ఇజ్రాయెల్ జెండాలను కొందరు నిరసనకారులు ప్రదర్శించారు. యూకే ప్రధాని కీర్ స్టార్మర్‌ను విమర్శిస్తూ ఆందోళనకారులు నినాదాలు చేశారు. 'వారిని తిరిగి పంపించేయండి' అని వలస వ్యతిరేక నినాదాలు రాసి ఉన్న ప్లకార్డులు ప్రదర్శించారు. మరికొంతమంది 'మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్' అని రాసి ఉన్న టోపీలు ధరించారు.

### ఎవరీ టామీ రాబిన్సన్..

లండన్‌లో జరిగిన ఈ ప్రదర్శనలు టామీ రాబిన్సన్ ఆధ్వర్యంలోనే జరిగాయి. ఆయన అసలు పేరు స్టీఫెన్ యాక్స్లీ లెన్నాన్. జర్నలిస్టుగా పనిచేస్తున్న రాబిన్సన్.. యూకే ప్రభుత్వంలోని అవినీతిని బయట పెడతానంటూ పలుమార్లు పేర్కొన్నారు. ఆయనకు ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ సహా పలువురి ప్రముఖుల మద్దతు ఉంది. తాజాగా జరిగిన ఈ ర్యాలీకి మస్క్ ఓ వీడియో ద్వారా మద్దతు తెలిపారు. బ్రిటన్‌లోని ప్రజలు తమ హక్కులను వినియోగించుకోవడానికి భయపడుతున్నారని ఆయన ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

# వరద సాయం.. ఉగ్రసంస్థల పాలు!

## - పాక్‌లో లష్కరే తోయిబా స్థావరాల పునరుద్ధరణ



ఉగ్రవాదులతో తమకు సంబంధం లేదని ప్రపంచ వేదికలపై పచ్చి అబద్ధాలు పలికే పాక్.. లోలోపల ఉగ్రస్థావరాల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నట్టు భారత నిఘా వర్గాలు వెల్లడించాయి. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఉగ్రవాదాన్ని నిర్మూలించడమే లక్ష్యంగా భారత్ పాక్‌లోని అనేక ఉగ్రస్థావరాలను ధ్వంసం చేసింది. అయినా బుద్ధిమారని దాయాది దేశం తినడానికి సరైన తిండి లేకపోయినా కూడా.. వరద భాదితుల పేరుతో సేకరించిన నిధులను ఉగ్రస్థావరాల పునరుద్ధరణకు ఖర్చు చేస్తున్నట్టు భారత నిఘా వర్గాలు పేర్కొన్నాయి. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత వైమానిక దళం ధ్వంసం చేసిన లష్కరే ప్రధాన క్యాంపు కార్యాలయం మర్కాజ్ తోయిబాను పునర్నిర్మించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపాయి. ధ్వంసమైన లష్కరే తోయిబా ప్రధాన కార్యాలయ విభాగాలను తొలగించడానికి దాని చుట్టూ భారీ యంత్రాలను మోహరించి ఉన్న దృశ్యాలు ఉపగ్రహ చిత్రాల్లో కనిపిస్తున్నట్టు భారత నిఘా వర్గాలు వెల్లడించాయి. దీనిని పునర్నిర్మించిన అనంతరం మళ్లీ ఉగ్రవాదులకు శిక్షణ స్థావరంగా ఉపయోగించనున్నట్టు తెలిపాయి. ఆపరేషన్ సిందూర్ సమయంలో ధ్వంసమైన ఎల్టికి ఆగస్టులో పాక్ ప్రభుత్వం నుంచి రూ.1.25 కోట్లు ఇవ్వగా.. పునరుద్ధరణకయ్యే మొత్తం ఖర్చు సుమారు రూ.4.7 కోట్లకు పైగా ఉంటుందని నిఘా వర్గాలు పేర్కొన్నాయి. వీటికి కావాల్సిన నిధుల సేకరణకు పాక్ మేకవన్నె పులిలా మానవతావాద ముసుగులో ప్రచారాలు చేపడుతోంది. వరద ప్రభావిత ప్రాంతాల సహాయం పేరిట విరాళాలు సేకరించి.. ఉగ్రసంస్థలకు మళ్లిస్తోంది. 2005లోనూ పాక్‌లో సంభవించిన భారీ భూకంపం సమయంలోనూ పాక్ ఇదే తరహాలో నిధులు సేకరించినట్లు భారత వర్గాలు పేర్కొన్నాయి. అప్పట్లో మానవతా సాయం పేరుతో సేకరించిన దాదాపు బిలియన్ డాలర్ల నగదులో 80 శాతాన్ని ఉగ్రసంస్థ ఎల్టిలో మౌలిక సదుపాయాల కోసం మళ్లించినట్లు తెలిపాయి.

### లష్కరే క్యాంపు కార్యాలయం

మురీద్కేలోని మర్కాజ్ తోయిబా ఓ పెద్ద ఉగ్ర స్థావరం. సరిహద్దుకు 30 కిలోమీటర్ల దూరంలోని లష్కరే క్యాంపు కార్యాలయం ఇది. దాదాపు 82 ఎకరాల్లో విస్తరించింది. ఇందులో మదర్సా, మార్కెట్‌వంటివీ ఉన్నాయి. ఉగ్రవాదాన్ని విస్తరించడంలో ఈ క్యాంపస్ కీలక పాత్ర. ఇది లష్కరే ప్రధాన కార్యాలయంగా పనిచేస్తోంది. దాదాపు 1,000 మంది వరకు ఇక్కడ ఉగ్ర శిక్షణ పొందుతున్నారు. దీనిలో అతిథి గృహ నిర్మాణానికి 2000 సంవత్సరంలో అల్ఖైదా అధినేత ఒసామా బిన్ లాడెన్ రూ.10 లక్షలు విరాళం ఇచ్చాడు. 26/11 ముంబయి ఉగ్రదాడికి పాల్పడిన వారిలో ఒకడైన అజ్మల్ కసబ్కు ఇక్కడే శిక్షణ ఇచ్చారు.

# చైనా నౌకలను అడ్డుకున్న తైవాన్

తైవాన్ కోస్ట్‌గార్డ్ అడ్మినిస్ట్రేషన్ (సీజీఏ) శనివారం చైనాకు చెందిన నౌకలను అడ్డుకొంది. వీటిల్లో బీజింగ్‌కు చెందిన కోస్ట్ గార్డ్ నౌక ఒకటికాగా.. మరొకటి భారీ చేపల పడవగా చెబుతున్నారు. రెండు నౌకలు డాంగ్షా ద్వీపం వద్ద కార్యకలపాలు సాగిస్తుండగా.. ఈ ఘటన చోటు చేసుకొంది. దీంతో తైవాన్ -చైనా మధ్య దక్షిణ చైనా సముద్ర జలాల్లో ఉద్రిక్తతలు పెరిగిపోయాయి. ఫోకస్ తైవాన్ పత్రిక కథనం ప్రకారం గురువారం ఉదయం 6.15 సమయంలో రెండు చైనా నౌకలను డాంగ్షా-నాంషా వద్ద గుర్తించారు. ఇవి ఇంకా నిషేధిత ప్రదేశానికి కొంచెం దూరంలో ఉండటంతో 2,000 టన్నుల కట్టర్ తైనాన్ అనే షిప్పు రంగంలోకి దించారు. అది శుక్రవారం చైనా కోస్టార్డ్ నౌకను వెన్నంటే ఉండటంతో.. అది అక్కడినుంచి వెళ్లిపోయింది. అయితే.. ఆ రోజు రాత్రి చైనా చేపలవేట నౌక నిషేధిత ప్రదేశానికి చేరుకొంది. దీంతో రెండు తైవాన్ నౌకలు అక్కడికి చేరుకొని దానిని అడ్డగించాయి. దీంతో అది వెనక్కి వెళ్లిపోయింది. ఇప్పటికే ఫిలిప్పీన్స్, తైవాన్ తమవిగా చెప్పుకొంటున్న స్కార్‌బోర్గ్ ఫోల్‌ను చైనా నేషనల్ నేచర్ రిజర్వ్‌గా ప్రకటించింది. దీనిపై ఇరు దేశాలు మండిపడ్డాయి. వివాదాస్పద ప్రదేశాల్లో తమ బలం చూపించుకోవడానికే చైనా ఇలా చేస్తోందనే ఆరోపణలున్నాయి.



# ఆగని మృత్యుఘోష!

## ఇజ్రాయెల్ దాడుల్లో 32మంది పాలస్తీనియన్లు మృతి



గాజా సిటీపై ఇజ్రాయెల్ విరుచుకుపడుతోంది. శుక్రవారం రాత్రినుంచి ఆ దేశ సైన్యం ఐడీఎఫ్ నిర్వహించిన దాడుల్లో 32 మంది పాలస్తీనియన్లు మృతి చెందారు. ఇందులో 12మంది చిన్నారులే. గత కొన్ని రోజులుగా గాజాలోని బహుళ అంతస్తుల భవనాలపై ఇజ్రాయెల్ బాంబుల వర్షం కురిపిస్తూ వాటిని నేలమట్టం చేస్తోన్న సంగతి తెలిసిందే. ఆ భవనాలపై హమాస్ నిఘా పరికరాలను ఉంచిందన్నది టెల్ అవీవ్ ఆరోపణ. ఇప్పటికే గాజా సిటీని ఖాళీ చేయమని అక్కడి పౌరులకు ఐడీఎఫ్ హెచ్చరికలు జారీ చేసింది. ఇప్పటివరకు దాదాపు 2,50,000 మంది గాజా సిటీని వీడినట్టు టెల్ అవీవ్ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు యెమెన్‌లోని హూతీ తిరుగుబాటుదారులు ఇజ్రాయెల్‌పై హైపర్ సోనిక్ బాలిస్టిక్ క్షిపణి ప్రయోగించారు. దీంతో టెల్ అవీవ్‌లో కొంతసేపు సైరన్లు మోగాయి. అయితే ఈ క్షిపణిని తాము విజయవంతంగా నిరోధించినట్టు ఐడీఎఫ్ తెలిపింది. లెబనాన్‌లోని పాలస్తీనా శరణార్థులు ఐదు ట్రక్కుల్లో ఆయుధాలను శనివారం ఆ దేశ సైన్యానికి అప్పగించారు. తమ దేశంలో ఉన్న హమాస్, హిజ్బుల్లా ఇతర గ్రూపులు ఆయుధాలు అప్పగించాలని లెబనాన్ ప్రభుత్వం ఇటీవల ఆదేశించింది. దీనికి హమాస్, హిజ్బుల్లా అంగీకరించలేదు. పాలస్తీనా లిబరేషన్ ఆథారిటీ (పీఎల్వో) ఆమోదం తెలిపింది. ఈమేరకు మే నుంచి పాలస్తీనా శరణార్థులు లెబనాన్ సైన్యానికి ఆయుధాలు అప్పగిస్తున్నారు.

# చైనా.. రివర్స్ వార్!

## చర్చలవేళ యూఎస్‌పై రెండు దర్యాప్తులు



ఎప్పుడూ చైనాపై ఏదోక దర్యాప్తు మొదలుపెట్టామని అమెరికా చెప్పడం సర్వ సాధారణంగా చూస్తుంటాం. కానీ, ఈసారి సీను రివర్స్ అయింది. వాషింగ్టన్ రెండు అంశాల్లో తప్పుడు విధానాలు అవలంభిస్తోందంటూ.. బీజింగ్ రెండు దర్యాప్తులు మొదలు పెట్టింది. అది కూడా స్పెయిన్‌లోని మాడ్రిడ్‌లో రెండు దేశాల మధ్య చర్చలు మొదలుకానున్న వేళ కావడం గమనార్హం. ఈ సమావేశంలో జాతీయ భద్రత, టిక్‌టాక్ సోషల్ మీడియా యాజమాన్య హక్కుల వంటివి చర్చకు రానున్నాయి.

అమెరికా సెమీకండెక్టర్లను లక్ష్యంగా చేసుకొని చైనా ఈ దర్యాప్తులు చేపట్టింది. కొన్ని ఐసీ చిప్స్ అమెరికాపై యాంటీ డంపింగ్ ఇన్వెస్టిగేషన్‌ను మొదలు పెట్టింది. వీటిని అమెరికాలోని టెక్సాస్ ఇన్స్ట్రుమెంట్స్, ఆన్ చిప్స్ సంస్థలు తయారు చేస్తుంటాయి. చైనాలో తయారైన సెమీకండెక్టర్లపై వివక్ష చూపుతోందంటూ మరో దర్యాప్తును చేపట్టింది. ఆదివారం మాడ్రిడ్‌లో చైనా వైస్ ప్రీమియర్ లిఫెంగ్, అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ భేటీ కానున్నారు. అమెరికా ఎగుమతి నియంత్రణలు, టారిఫ్‌లవంటి వాటిని ఈ సందర్భంగా చైనా బలంగా ప్రస్తావించే అవకాశం ఉంది. శుక్రవారం అమెరికా ప్రభుత్వం 23 సంస్థలను ఆంక్షల పరిధిలోని జాబితాలో చేర్చడంతో చైనా ప్రతీకారంగా ఈ నిర్ణయం తీసుకొంది. వీటిల్లో చైనా చిప్స్ తయారీ సంస్థ ఎస్ఎమ్ఐసీ కూడా ఉంది.

మరోవైపు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇప్పుడు తన గురిని చైనాపై పెట్టారు. నాటో దేశాలన్నీ రష్యానుంచి చమురు కొనుగోలు నిలిపివేయాలని శనివారం పిలుపునిచ్చారు. దాంతోపాటు రష్యన్ పెట్రోలియం కొంటున్న చైనాపై 50నుంచి 100 శాతం సుంకాలు విధిస్తానని కూడా సంకేతం పంపారు. భారీస్థాయిలో డ్రాగన్‌పై సుంకాలు విధిస్తేనే రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నిలిచిపోతుందని తాను విశ్వసిస్తున్నట్టు ప్రకటించారు. కొన్ని నాటో దేశాలు ఇప్పటికీ రష్యానుంచి చమురు కొనుగోలు చేస్తుండటం దిగ్భ్రాంతికి గురిచేస్తోందని ట్రంప్ తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. యుద్ధాన్ని నిలువరించేందుకు కావాల్సిన నిబద్ధత కొన్ని నాటో దేశాల్లో 100 శాతం కన్నా ఎంతో తక్కువగా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

చైతన్యరథం

# దుబాయ్‌లో పాక్ చిత్తు



- ఆసియా కప్ గ్రూప్ మ్యాచ్‌లో భారత్ సునాయాస విజయం
- రాణించిన కుల్‌దీప్, సూర్యకుమార్




ఆసియా కప్ - 2025లో భాగంగా దుబాయ్ వేదికగా ఆదివారం జరిగిన మ్యాచ్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను భారత్ చిత్తుగా ఓడించింది. పాకిస్థాన్ విధించిన 128 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని భారత్ 15.5 ఓవర్లలో కేవలం మూడు వికెట్లు కోల్పోయి సునాయాసంగా ఛేదించింది. ఓపెనర్లలో శుభ్‌మన్ గిల్ (10- 7 బంతులు, 2 ఫోర్లు) నిరాశపర్చగా అభిషేక్ శర్మ (31- 13 బంతులు, 4 ఫోర్లు, 2 సిక్సులు) దూకుడుగా ఆడాడు. వీరిద్దరూ సయూమ్ అయూబ్ బౌలింగ్‌లోనే అవుటయ్యారు. తిలక్ వర్మ 31 (31 బంతులు- 2 ఫోర్లు, ఒక సిక్స్) వికెట్ కూడా అయూబ్‌కే దక్కింది. సూర్యకుమార్ 47 నాటౌట్ (37 బంతులు, 5 ఫోర్లు, ఒక సిక్స్) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడగా, శివమ్ దూబే అజేయంగా 10 ( 7 బంతులు 1 సిక్స్) పరుగులు చేశాడు. భారత్ కోల్పోయిన మూడు వికెట్లూ అయూబ్ ఖాతాలోకే చేరటం విశేషం.

టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన పాక్ జట్టు.. 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 127 పరుగులు చేసింది. సాహిబ్‌జాదా ఫర్హాన్ (40) టాప్ స్కోరర్. షాహీన్ అఫ్రిది (33 నాటౌట్), ఫకర్ జమాన్ (17), ఫహీమ్ అష్రఫ్ (11), ముఖీమ్ (10) పరుగులు చేశారు. భారత బౌలర్లలో కుల్‌దీప్ యాదవ్ మూడు, అక్షర్ పటేల్, బుమ్రా రెండు చొప్పున, హార్దిక్ పాండ్యా, వరుణ్ చక్రవర్తి చెరో వికెట్ తీశారు. భారత్ చైనామన్ బౌలర్ కుల్‌దీప్ యాదవ్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది.

టీమ్ ఇండియా కట్టుదిట్టమైన బౌలింగ్‌తో పాకిస్థాన్ జట్టును కట్టడి చేసింది. తొలి ఓవర్ వేసిన హార్దిక్ పాండ్యా.. తొలి బంతికే సయిమ్ అయూబ్ (0)ను గోల్డెన్ డక్‌గా పెవిలియన్ బాట పట్టించాడు. రెండో ఓవర్లో బుమ్రా బౌలింగ్‌లో మహమ్మద్ హారిస్ (3) రూపంలో రెండో వికెట్ లభించింది. ఆ తర్వాత సాహిబ్‌జాదా ఫర్హాన్, ఫకర్ జమాన్లు ఇన్నింగ్స్ నిర్మించే ప్రయత్నం చేశారు. 7.4 ఓవర్లో ఫకర్ జమాన్‌ను అక్షర్ పటేల్ ఔట్ చేశాడు. 13వ ఓవర్లో కుల్‌దీప్ రెండు వికెట్లు తీశాడు. చివర్లో షాహీన్ అఫ్రిది దూకుడుగా ఆడాడు.

**అయూబ్ గోల్డెన్ డక్**

పాక్ ఇన్నింగ్స్ తొలి ఓవర్ వేసిన పాండ్యా.. మొదటి బంతిని ఆఫ్ స్టంప్ దిశగా బ్యాక్ ఆఫ్ లెంగ్త్ డెలివరీగా సంధించాడు. ఆ బంతిని సయూమ్ అయూబ్ ఆఫ్ సైడ్ పాయింట్ దిశగా షాట్ ఆడేందుకు ప్రయత్నిచాడు. అయూబ్ షాట్ చక్కగానే కనెక్ట్ చేసినప్పటికి బంతి మాత్రం నేరుగా బ్యాక్‌వర్డ్ పాయింట్లో ఉన్న జస్‌ప్రీత్ బుమ్రా చేతుల్లోకి వెళ్లింది. దీంతో చేసేదేమిలేక అయూబ్ నిరాశతో పెవిలియన్‌కు చేరాడు.

అయితే భారత్ మ్యాచ్‌కు ముందు అయూబ్‌ను ఉద్దేశించి పాక్ మాజీ ఆటగాడు తన్వీర్ అహ్మద్ ఇచ్చిన స్టేట్మెంట్‌ను ఇప్పుడు భారత అభిమానులు ప్రస్తావిస్తున్నారు. బుమ్రా బౌలింగ్లో అయూబ్ ఆరు సిక్సులు కొడతాడని అహ్మద్ గొప్పలు చెప్పాడు. దీంతో అహ్మద్, అయూబ్‌ను కలిసి నెటిజన్లు దారుణంగా ట్రోల్ చేశారు.

# బాక్సింగ్‌లో మెరిసిన భారత మహిళలు

*రెండు స్వర్ణాలు సహా నాలుగు పతకాలు*

ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్ షిప్‌లో భారత్ కొత్త చరిత్ర సృష్టించింది. భారత మహిళా బాక్సర్లు రెండు స్వర్ణ పతకాలు, ఒక రజత, ఒక కాంస్య పతకం సాధించారు. 48 కిలోల విభాగంలో మీనాక్షి హుడా, 57 కిలోల విభాగంలో జైస్మిన్ లంబోరియా స్వర్ణ పతకాలు సాధించారు. 80 కేజీల విభాగంలో నుపూర్ రజత పతకాన్ని, పూజా రాణి కాంస్య పతకాన్ని గెలుచుకున్నారు. వరల్డ్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్‌లో భారత్‌కు చెందిన నలుగురు మహిళా బాక్సర్లకు పతకాలు రావటం ఇదే తొలిసారి కావటం విశేషం.

మహిళల 57 కిలోల విభాగంలో పోలాండ్‌కు చెందిన ఒలింపిక్ రజత పతక విజేత జూలియా సెరేమెతాతో పోరాడి జైస్మిన్ లంబోరియా గెలిచింది. దాదాపు ఓటమి అంచుల్లోకి చేరిన సమయంలో ఆమె చూపిన ఫైటింగ్ స్పిరిట్ అందరినీ ఆశ్చర్యపరిచింది. ఫైనల్ బౌట్‌లో 4-1 స్ప్లిట్ డిసిషన్‌తో ఆమె గెలిచింది. బౌట్ ముగిసిన అనంతరం లంబోరియా మాట్లాడుతూ ఈ ఫీలింగ్ మాటల్లో చెప్పలేనంది. వరల్డ్ ఛాంపియన్ అయ్యానంటే చాలా ఆనందంగా ఉంది. పారిస్ 2024లో తొందరగా ఓడిన తర్వాత శారీరకంగా, మానసికంగా, టెక్నికల్‌గా బాగా ప్రిపేర్ అయ్యాను.







ఈ విజయం ఆ కష్టానికి ఫలితమని జైస్మిన్ పేర్కొంది.

మరో ఫైనల్ మ్యాచ్‌లో కజకిస్థాన్ ప్లేయర్ పై మీనాక్షి హుడా 4-1 తేడాతో విజయం సాధించారు. ఈ ఫైనల్ మ్యాచ్‌లో పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత అయిన నాజిమ్ నుంచి మీనాక్షికి గట్టి పోటీ ఎదరైంది. ప్రత్యర్థిపై తన పంచ్‌లతో అద్భుతమైన ప్రదర్శన కనబరిచిన మీనాక్షి.. తొలి రౌండ్‌ను 4-1తో సొంతం చేసుకుంది. ఆ తర్వాత నాజిమ్ అద్భుతమైన కమ్ బ్యాక్ ఇచ్చింది. దీంతో రెండో రౌండ్లో మీనాక్షిపై నాజిమ్ 3-2తో విజయం సాధించింది. మూడో రౌండ్‌లో ఈ ఇద్దరూ బాక్సర్లు హోరాహోరీగా తలపడ్డారు. నిర్ణీత సమయంలో ఎవరూ పాయింట్లు సాధించకపోవడంతో నలుగురు న్యాయమూర్తులు మీనాక్షికి అనుకూలంగా ఓటు వేశారు. దీంతో 4-1 స్ప్లిట్ డెసిషన్‌తో మీనాక్షి స్వర్ణం సొంతం చేసుకుంది.

ఇదే టోర్నీలో 80 ప్లస్ కేజీల విభాగంలో నుపుర్‌కు కొద్దిలో స్వర్ణం చేజారి రజత పతకం దక్కింది. అగాటా కాజ్మర్స్కాతో (పోలాండ్) ఫైనల్లో నుపుర్ 2-3తో పోరాడి ఓడింది. 80 కేజీల విభాగంలో పూజా రాణి కాంస్యంతో సరిపెట్టుకుంది. ఇంగ్లాండ్‌కు చెందిన ఎమిలీ అస్క్విత్‌తో సెమీఫైనల్లో గట్టిగానే పోరాడినప్పటికీ చివరికి ఓటమి పాలయింది.

**పురుషుల విభాగంలో నిరాశ**

పురుషుల విభాగంలో మాత్రం భారత్‌కు నిరాశ ఎదురైంది. 50 కేజీ విభాగంలో జదుమణి సింగ్ మాండెంగ్‌బాం, కజకిస్థాన్‌కు చెందిన ప్రపంచ చాంపియన్ సంజర్ టష్కెన్‌బే చేతిలో 0-4తో ఓడిపోయాడు. దీంతో ఈసారి భారత పురుషుల జట్టు మెడల్ లేకుండా వెనుతిరిగింది. ఈ విధంగా జరగటం 2013 తర్వాత ఇదే మొదటిసారి కావడం విశేషం.

# ఆస్ట్రేలియా శుభారంభం

- తొలి వన్డేలో 8 వికెట్లతో ఘన విజయం

మూడు వన్డేల సిరీస్‌లో ఆస్ట్రేలియా మహిళల జట్టు శుభారంభం చేసింది. ఆదివారం చండీగఢ్‌లోని ముల్లన్‌పూర్‌లో జరిగిన తొలి మ్యాచ్‌లో ఆస్ట్రేలియా మహిళల జట్టు ఎనిమిది వికెట్ల తేడాతో భారత్‌పై ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత మహిళల జట్టు నిర్దేశించిన 282 పరుగుల లక్ష్యాన్ని 44.1 ఓవర్లలో కేవలం రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి ఆస్ట్రేలియా ఛేదించింది. ఆ జట్టులో అలిసా హేలీ 27 (23 బంతులు), ఫోబే లిచ్‌ఫీల్డ్ 88 (80 బంతులు), ఎల్సీ ఫెర్రీ 30 ( 38 బంతులు- రిటైర్డ్ హర్ట్), బెత్ మూనీ 77 నాటౌట్ (74 బంతులు), అనాబెల్ సదర్‌ల్యాండ్ 51 నాటౌట్ (51 బంతులు) పరుగులు చేశారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఫోబే లిచ్‌ఫీల్డ్ ఎంపికయింది.

**భారత బౌలర్లలో క్రాంతి గౌడ్, స్నేహ రాణాకు చెరో వికెట్ దక్కింది**

అంతకు ముందు టాస్ గెలిచిన భారత్ బ్యాటింగ్ ఎంచుకుంది. ఓపెనర్లు ప్రతికా రావల్ (64), స్మృతి మంధాన (58) తొలి వికెట్కు శతక భాగస్వామ్యం (114) జోడించారు. ప్రత్యర్థి బౌలింగ్పై ఆధిక్యత ప్రదర్శించారు. స్వల్ప వ్యవధిలోనే ప్రతికా, స్మృతి ఔటైనప్పటికీ.. హర్లీన్ డియోల్ (54) దూకుడుగా ఆడేసింది. కెప్టెన్ హర్మన్ ప్రీత్ (11), జెమీమా రోడ్రిగ్స్ (18) ఎక్కువ సమయం క్రీజ్లో నిలవలేదు. ఉన్నంతసేపు దూకుడు ప్రదర్శించారు. ఆఖర్లో రిచా ఘోష్ (25), దీప్తి శర్మ (20లి), రాధా యాదవ్ (14) వేగంగా ఆడి పరుగులు రాబట్టారు. ఆసీస్ బౌలర్లలో స్కట్ 2.. అన్నాబెల్, అలాన్ కింగ్, మెక్‌గ్రాత్ తలో వికెట్ తీశారు.

**టాపార్డర్ బాటర్ల అర్ధశతకాలు**

టాస్ గెలిచిన భారత్ బ్యాటింగ్ ఎంచుకోగా ఓపెనర్లు ప్రతికా రావల్ (96 బంతుల్లో 64), స్మృతి మంధాన (63 బంతుల్లో 58) అర్ధ శతకాలతో అదరగొట్టగా.. వన్‌డౌన్ బ్యాటర్ హర్లీన్ డియోల్ (57 బంతుల్లో 54) కూడా హాఫ్ సెంచరీతో ఆకట్టుకుంది. అయితే, మిగతా వారంతా తేలిపోయారు. కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ 11, జెమీమా రోడ్రిగ్స్ 18 పరుగులు మాత్రమే చేయగా.. రిచా ఘోష్ 25, దీప్తి శర్మ 20 (నాటౌట్) ఫర్వాలేదనిపించారు. రాధా యాదవ్ 19 పరుగులు చేసింది. ఈ క్రమంలో నిర్ణీత 50 ఓవర్లలో భారత జట్టు ఏడు వికెట్ల నష్టానికి 281 పరుగులు చేసింది.

**చరిత్ర సృష్టించిన ఓపెనింగ్ జోడీ**

గతేడాది నుంచి భారత జట్టు ఓపెనర్లుగా వస్తున్న స్మృతి మంధాన- ప్రతికా రావల్ ఆకాశమే హద్దుగా చెలరేగుతున్నారు. ఇప్పటికే మహిళల




వన్డే క్రికెట్లో అత్యుత్తమంగా 84.66 సగటుతో వెయ్యి పరుగులు చేసిన తొలి జంటగా వీరు చరిత్రకెక్కారు. కాగా 2025లో ఇప్పటి వరకు స్మృతి- ప్రతీకా కలిసి 958 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. అంతకుముందు.. 2000 సంవత్సరంలో బెలిండా క్లార్క్- లీసా కేట్లీ (ఆసీస్) 905 పరుగుల పార్ట్నర్షిప్ సాధించగా.. స్మృతి- ప్రతీకా తాజాగా వారిని అధిగమించారు. అంతేకాకుండా.. భారత మహిళా వన్డే క్రికెట్లో తక్కువ ఇన్నింగ్స్‌లోనే ఎక్కువసార్లు 100 ప్లస్ ఓపెనింగ్ స్కోర్లు నమోదు చేసిన క్రికెటర్లుగా స్మృతి- ప్రతీకా చరిత్రకెక్కారు. జయా శర్మ- కరుణా జైన్ 25 ఇన్నింగ్స్ లో ఐదుసార్లు వందకు పైగా భాగస్వామ్యం సాధించగా.. స్మృతి- ప్రతీకా 15 ఇన్నింగ్స్ లోనే ఈ ఫీట్ అందుకున్నారు.

# చిరు సినిమాకు సినిమాటోగ్రాఫర్‌గా..



'మిరాయ్'తో ఘనవిజయం అందుకున్న కార్తీక్ ఘట్టమనేని, ఇప్పుడు చిరంజీవికి మళ్లీ సినిమాటోగ్రఫీ అందించనున్నాడట. చిరంజీవి బాబీ కొల్లి కాంబినేషన్‌లో వచ్చే సినిమాలో సినిమాటోగ్రాఫర్‌గా తాను పనిచేయనున్నట్టు కార్తీక్ ఘట్టమనేని తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో క్లారిటీ ఇచ్చాడు. సినిమాటోగ్రాఫర్ నుంచి దర్శకుడిగా మారి 'మిరాయ్'తో బ్లాక్‌బస్టర్ అందుకున్నాడు కార్తీక్. 2013లో 'ప్రేమ ఇష్క్ కాదల్'తో సినిమాటోగ్రాఫర్‌గా మారిన కార్తీక్.. ఆ తర్వాత కార్తికేయ, ఎక్స్‌ప్రెస్ రాజా, ప్రేమమ్, రాధ, నిన్నుకోరి వంటి చిత్రాలకు కెమెరామెన్‌గా పనిచేశారు. మధ్యలో దర్శకుడిగా చేస్తూనే.. సినిమాటోగ్రాఫర్‌గానూ కార్తీక్ సినిమాలు చేస్తున్నాడు. ఈ క్రమంలోనే మెగాస్టార్ సినిమాకి కూడా వర్క్ చేయబోతున్నాడు. గతంలో చిరు, బాబీ కాంబినేషన్‌లో వచ్చిన వాల్తేరు వీరయ్య మంచి విజయం సాధించింది. ఇక ఈ సినిమాలో ఫ్యామిలీ ఎమోషన్స్ ప్రధానంగా ఉంటాయని తెలుస్తోంది. స్టోరీ కూడ ప్రత్యేకంగా ఉంటుందట. చిరును కొత్తగా చూపించాలనే ఉద్దేశ్యంతో ఈ కథ రాసుకున్నారట బాబీ.



# ఉస్తాద్ షూట్ పార్ట్ పూర్తైందట

*పవన్ కళ్యాణ్‌నుంచి రానున్న పలు చిత్రాల్లో పక్కా మాస్ ఎంటర్‌టైనర్ "ఉస్తాద్ భగత్ సింగ్". హరీష్ శంకర్ దర్శకత్వంలో చేస్తున్న రెండో సినిమా ఇది. పవన్ అభిమానులకి ఫీస్ట్ సినిమాగా తాను తెరకెక్కిస్తుండగా. ఇపుడు షూటింగ్‌పై ఫైనల్‌గా ఓ క్లారిటీ వచ్చేసింది. రీసెంట్‌గానే పవన్ ఈ సినిమా షూటింగ్‌ని ఈ వారంలోనే ముగించేస్తారని చెప్పాము. అనుకున్నట్టే పవన్ షూటింగ్ కంప్లీట్ చేసేశారంటూ హీరోయిన్ రాశీ ఖన్నా ఖరారు చేసింది. పవన్‌తో కలిసి దిగిన ఫోటో షేర్ చేసుకొని ఆమె తనతో వర్క్ చేయడంపై ఆనందం వ్యక్తం చేసింది. పవన్‌తో వర్క్ చేయడం తన లైఫ్ టైం మెమరీగా గుర్తుంచుకుంటాను అని ఆమె చెబుతుంది. ఇలా పవన్ తీసిన సెల్ఫీకి ఫోజిచ్చి.. గ్లామర్‌ను షేర్ చేసుకుంది.*

# అందుకే.. వైబ్ సాంగ్ తీసేశాం




'మిరాయ్' సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ కలెక్షన్స్ రాబడుతుంది. రెండు రోజుల్లో ఈ మూవీ ప్రపంచవ్యాప్తంగా రూ. 55. 6కోట్లు సాధించింది. ఈ సందర్భంగా దర్శకుడు కార్తిక్ ఘట్టమనేని ఓ ఇంటర్వ్యూలో పలు ఇంట్రెస్టింగ్ విషయాలు చెప్పుకొచ్చారు. ఇంతకీ ఆయన ఏం మాట్లాడారంటే.. 'ఈ సినిమాను చిన్నారులకు దగ్గర చేయాలనే ఉద్దేశంతో నిడివి విషయంలో జాగ్రత్త తీసుకున్నాం. నా నిర్ణయమైతే.. 4 గంటల నిడివి ఉంచేవాడినేమో. ఈ విషయంలో ఎడిటర్ శ్రీకర్ ప్రసాద్ ఎప్పటికప్పుడు సింపుల్‌గా వెళ్దామని చెప్పేవారు' అని తెలిపారు. కార్తిక్ ఘట్టమనేని ఇంకా మాట్లాడుతూ.. 'నిజానికి కథకు అడ్డం వస్తున్నాయని రెండు పాటలు తీసేశాం. ఇందులో భాగంగానే 'వైబ్' సాంగ్ కూడా. సినిమాలో ఆ సాంగ్ కుదిరితే పెడదాం. లేకపోతే వద్దనుకున్నాం. ఐతే, ఆ పాట విడుదల చేసినప్పుడు 'ప్రమోషనల్ సాంగ్' అని చెప్పి ఉంటే బాగుండేది' అని ఆయన తెలిపారు. ఇక 'అశోకుడి తొమ్మిది గంథ్రాలు ఉన్నాయన్న కథ ప్రచారంలో ఉంది. హిట్లర్ సహా పలువురు వాటి కోసం ప్రయత్నం చేశారట. అలా ప్రచారంలో ఉన్న కథలకు ఫాంటసీ జోడించి కథను సిద్ధం చేసుకున్నాం' అని కార్తిక్ చెప్పుకొచ్చారు.

# రూ.200 కోట్ల నష్టాలు మిగిల్చింది



బాలీవుడ్ స్టార్ హీరో అమీర్ ఖాన్ తన 'లాల్ సింగ్ చడ్డా' సినిమా గురించి ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. 'నేను కీలక పాత్రలో నటించిన 'లాల్ సింగ్ చడ్డా' రూ. 200 కోట్లకు పైగా నష్టాలను మిగిల్చింది. నిజానికి నేను నిర్మించే ప్రతి సినిమా బడ్జెట్ విషయంలో జాగ్రత్తగా ఉండటం నాకు అలవాటు. కథకు ఏది అవసరమో దాన్నే ఎంపిక చేసుకుంటాను. ఈ సినిమా చేయడం వల్ల ఇంత లాభం వస్తుందనే విషయంపై కాకుండా నష్టాల పాలవ్వకుండా చూడటమే నా ప్రథమ కర్తవ్యం' అని తెలపారు. ఆమీర్‌ఖాన్ ఇంకా మాట్లాడుతూ.. 'అయితే, దురదృష్టవశాత్తూ 'లాల్ సింగ్ చడ్డా' విషయంలో దానిని విస్మరించా. అప్పటివరకూ నేను చేసిన సినిమాలన్నీ హిట్ మీద హిట్ కొట్టడంతో ఈ మూవీ విషయంలో అతి నమ్మకం ఎక్కువైంది. కానీ, నా అంచనా తప్పింది. బడ్జెట్ విషయంలో పరిమితులు పెట్టుకోకపోవడంతో నష్టాలు మిగిల్చింది' అని ఆమీర్‌ఖాన్ తెలిపారు. కాగా 'లాల్ సింగ్ చడ్డా'లో నాగచైతన్య, కరీనా కపూర్‌ఖాన్, మోనా సింగ్, మానవ్ విజ్ తదితరులు కీలక పాత్ర పోషించారు.

# యుఫోరియా.. ఫ్యామిలీ సినిమా అట




గుణశేఖర్ దర్శకత్వంలో విఘ్నేశ్ గవిరెడ్డి హీరోగా రాబోతున్న సినిమా 'యుఫోరియా'. రాగిణి గుణ సమర్పణలో నీలిమ గుణ నిర్మించారు. ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అయితే, ఈ సినిమాలో దాదాపు 10 నిమిషాల పాటు వివిఎక్స్ ఉంటాయని.. పైగా గ్రాఫిక్స్ అన్ని భారీస్థాయిలో ఉంటాయని తెలుస్తోంది. గ్రాఫిక్స్ కోసం గుణశేఖర్ ప్రత్యేకంగా ఓ టీమ్‌ను ఏర్పాటు చేసుకున్నారట. ముఖ్యంగా నేటి యువత అలవాట్లపై వచ్చే విజువల్ సాంగ్ సినిమాలోనే హైలైట్ గా ఉంటుందట. కాగా ఈ సినిమా పక్కా యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా ఉండబోతుంది. మొత్తానికి గుణశేఖర్ రాసిన స్క్రిప్ట్ చాలా కొత్తగా ఉండబోతుందని.. గుణశేఖర్‌లో కొత్త కోణాన్ని చూస్తారని.. అలాగే ప్రధానంగా నేటి యువత తాలూకు ఎమోషన్స్‌ను చాలా బాగా చూపించబోతున్నారని తెలుస్తోంది. కాబట్టి.. ఈ సినిమా సూపర్ హిట్ అవుతుందన్న అంచనాలున్నాయి. అలాగే, అందరికీ కనెక్ట్ అయ్యే మంచి సందేశం కూడా ఉంది. ఈ సినిమాతో దాదాపు 20మంది కొత్తవాళ్లు తెరకు పరిచయం కానున్నారు. కాగా ఈ చిత్రం కుటుంబ సమేతంగా చూడదగ్గట్లుగా ఉంటుందట.

# శరవేగంగా లెనిన్



అఖిల్ తన లెనిన్ చిత్రాన్ని దర్శకుడు మురళీ కిషోర్ అబ్బూరి (నందు) డైరెక్షన్‌లో చేస్తున్నాడు. ఇప్పటికే, 80 శాతం షూటింగ్‌ను పూర్తి చేసుకున్న సినిమా.. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ కూడా ఆల్‌రెడీ మొదలైంది. ప్రస్తుతం సినిమా క్లైమాక్స్‌ను షూట్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ క్లైమాక్స్ షూట్ పూర్తయ్యాక, అఖిల్ తన పాత్రకు డబ్బింగ్‌ను కూడా పూర్తి చేస్తారట. ఈ క్లైమాక్స్ షూట్‌ను ఈనెల ఎండింగ్‌లో తీసే అవకాశం ఉంది. ఈ సినిమా.. రాయలసీమ బ్యాక్ డ్రాప్‌తో చిత్తూరు ప్రాంతం నేపథ్యంలో తెరకెక్కుతుంది. అఖిల్ మాడ్యులేషన్ పూర్తిగా చిత్తూరు యాసలోనే ఉండబోతుంది. ఇక ఈ సినిమాలో అందాల భామ శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ చిత్ర యూనిట్ అనుకుంటున్న ప్లాన్ ప్రకారం ఈ చిత్రాన్ని నవంబర్ 14న రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారు. ఇక సినిమాపై భారీ అంచనాలున్నాయి. ముఖ్యంగా అఖిల్ –శ్రీలీల లవ్ సీన్స్ క్యూట్‌గా వచ్చాయన్న టాక్ నడుస్తోంది. సినిమాపై అఖిల్ చాలా హోప్స్ పెట్టుకున్నాడు.

# అలాంటి పిచ్చిపనులు వద్దు



ఒక సినిమా ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోతే నిరుత్సాహపడొద్దని, తప్పెక్కడ జరిగిందో గ్రహిస్తే మరో ప్రయత్నంతో విజయం అందుకోవచ్చని వర్ధమాన దర్శకులకు మారుతి సలహా ఇచ్చారు. తన సినిమాని ప్రేక్షకులు చూడటం లేదంటూ తనను తాను చెప్పుతో కొట్టుకున్న 'త్రిబాణధారి బార్బరిక్' దర్శకుడి గురించి ప్రస్తావించారు. తన నిర్మాణ సంస్థలో రూపొందిన 'బ్యూటీ' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో మారుతి మాట్లాడుతూ.. "బ్యూటీ" మూవీ రైటర్ సుబ్రహ్మణ్యం నాకెప్పటి నుంచో తెలుసు. ఈ కథ ఆయనదే అయినా దర్శకత్వ బాధ్యతలను మరొకరికి ఇవ్వగలిగారు. 'భలే ఉన్నాడే' సినిమా ఫెయిల్యూర్‌తో బాధపడున్న శివ సాయివర్ధన్‌కు ఆ అవకాశం ఇప్పించా. ఎవరైనా బాధలో ఉంటే నా వంతు ప్రోత్సాహం ఇవ్వాలనుకుంటా"

"ది రాజాసాబ్ షూటింగ్‌తో నేనెంత బిజీగా ఉన్నా నిర్మాత విజయ్‌పాల్‌తో తరచూ మాట్లాడేవాడిని. ఆయన నిర్మాణంలో మోహన్ శ్రీవత్స తెరకెక్కించిన 'త్రిబాణధారి బార్బరిక్' టైటిల్ విషయంలో ఎన్నో సలహాలిచ్చా. బార్బరిక్ అంటే ఎక్కువ మందికి చేరువ కాకపోవచ్చు అంటూ కొన్ని పేర్లను మోహన్‌కు సూచించేవాడిని. కానీ, ఆయన ఒక ట్రాన్స్‌లో ఉండిపోయారు. ఆ టైటిల్తోనే రిలీజ్ అయింది. మంచి సినిమాని ప్రేక్షకులు చూడటం లేదంటూ ఆయన చెప్పుతో కొట్టుకోవడం బాధ కలిగించింది. డైరెక్టర్లు, కళాకారులు దయచేసి అలాంటి పిచ్చి చేష్టలు చేయొద్దు. ఆడియన్సును థియేటర్లకు తీసుకొచ్చేందుకు కొందరు అసభ్య పదజాలంతో ప్రమోషన్స్ చేస్తున్నారు. మరికొందరు సినిమాలే మానేస్తాం అంటున్నారు. ఒక సినిమా అనుకున్నంతగా ప్రదర్శితం కాకపోతే ఇంతకు దిగజారుతారా? ఒకటి కాకపోతే మరొక సినిమా హిట్టవుతుంది. కాంట్రవర్సీగా మాట్లాడితేనే తమ సినిమాపై ప్రేక్షకుల దృష్టి ఉంటుందని పలువురు అనుకుంటున్నారు" అని మారుతి ఆందోళన వ్యక్తం చేశారు.